
1
నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం 18 ఏప్రిల్ 2023



హరితహారం మొక్కలు దహనం చేసిన వ్యక్తికి జరిమానా

నవ తెలంగాణ-మద్దూరు



మండలంలోని సలాక్ పూర్ గ్రామంలో హరితహారం మొక్కలను దహనం చేసిన ఏడాకుల భాస్కర్ రెడ్డి అనే వ్యక్తికి పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ రూ.మూడువేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న హరితహారం మొక్కలను ఏడాకుల భాస్కర్ రెడ్డి అనే వ్యక్తి దగ్ధం చేయడంతో అతనికి వెంటనే జరిమానా విధించాలని సర్పంచ్ వంగ భాస్కర్ రెడ్డి ఆదేశాల జారీ చేశారని తెలిపారు. ఈ మేరకు అతనికి మూడు వేల రూపాయల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి: ఎస్పీ

నవతెలంగాణ మెదక్ రూరల్



ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ సీఐలను ఆదేశించారు.

డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

నవ తెలంగాణ-దౌల్తాబాద్



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్ రూమ్ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్ర శేఖర్‌రావు పేద ప్రజల కోసం తీసుకువచ్చినా... రెవెన్యూ అధికారుల తీరు దేవుడు వరమిచ్చినా పూజారి కనుకరించడం లేదన్న చందంగా మారింది. నిరుపేదలకు అందాల్సిన ఇండ్లు ధనికులకు కేటాయించిన వైనం దౌల్తాబాద్‌లో వెలుగు చూసింది. ఇండ్లు లేని పేదల కోసం అరవై డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రభుత్వం నిర్మించింది. డబుల్ బెడ్ రూం ఇండ్లు అందని అర్హులు ఇంకా దాదాపు వంద కుటుంబాలున్నాయి. అసలు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ ఏ విధంగా జరిగిందో రెవెన్యూ అధికారుల వద్ద సమాచారం లేదు. లబ్దిదారుల ఎంపిక కోసం అర్హులైనవారి నుండి దరఖాస్తులు స్వీకరించి వారివారి ఇండ్ల వద్దకు రెవెన్యూ అధికారులు వెళ్లి సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలి. ఎంపికైనా అర్హుల జాబితా గ్రామ పంచాయతీ తీర్మానం చేసి నోటీసు బోర్డులో ఉంచాలి. జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు అంటే తిరిగి సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలి. ఇక్కడ మాత్రం పూర్తి భిన్నంగా అధికారులు ఇష్టానుసారం లబ్దిదారులను ప్రకటించారు. ఆశ్చర్యం ఏమిటంటే ఒకే తేదీన లబ్దిదారుల జాబితాతో మూడు తీర్మానాలు చేయడం గమనార్హం. అర్హులైన ప్రజలు రెవెన్యూ కార్యాలయానికి చెప్పులు అరిగేలా తిరిగినా ఫలితం శూన్యం. ఇకనైనా అధికారులు మొద్దు నిద్ర వీడి డబుల్ బెడ్ రూం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో జరిగిన అవకతవకలు గుర్తించి అర్హులకు న్యాయం జరిగేలా చేస్తారా లేదా అనేది వేచి చూడాలి మరి.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

సంగారెడ్డి జిల్లా ఎస్పీ ఎం.రమణ కుమార్



నవతెలంగాణ-సంగారెడ్డి

పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి అధికారులందరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఎం.రమణకుమార్ పేర్కొన్నారు. మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వారికి న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. ప్రజలలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందన్నారు. రౌడీలు, కేడీలు సస్పెక్ట్‌ల కదలికలపై నిరంతరం నిఘావుండాలన్నారు. పెండింగ్‌లో (అండర్ ఇన్వెస్టిగేషన్) ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి తెలుసుకొన్నారు. సైబర్ నేరాలకు గురైనట్లైతే వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్ డి పి ఎస్ యాక్ట్ కేసుల విషయమై కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ టి. ఉషావిశ్వనాథ్, సంగారెడ్డి డి.ఎస్.పి రవీంద్రారెడ్డి, పటాన్చెరు డిఎస్పి భీమ్ రెడ్డి, జహీరాబాద్ డిఎస్పి రఘు, నారాయణఖేడ్ డిఎస్పి వెంకట్ రామ్ రెడ్డి, డి.సి.ఆర్.బి. డిఎస్పి. బాలాజీ, డి.సి.ఆర్.బి. ఇన్స్పెక్టర్ బి.రమేష్, యస్.బి ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కత్తి కార్తీకగౌడ్



నవ తెలంగాణ - దౌల్తాబాద్

మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన చాంద్‌బీ కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కత్తి కార్తీక గౌడు పరామర్శించారు. అనంతరం బీడీ కార్మిక కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కారణాల శ్రీనివాసరావు, దేవి రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కనకా రెడ్డి, ఐరన్ సాయి పాల్గొన్నారు.

కోతుల అలజడిలో చిన్నారి మృతి

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం కట్కూరు గ్రామంలో కోతులు సృష్టించిన అల జడిలో దేవునూరి అభినవ్(3) సోమవారం అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రా మస్తుల వివరాల ప్రకారం... దేవునూరి వారి అభినవ్ తండ్రి శ్రీకాంత్ ఇంటి బయట ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా ఇంటిపై రేకులపై కోతులు అలజడి సృష్టించాయి. దీంతో రేకుల మీద ఉన్న పెద్ద బండరాయి బాలుడి తలపై పడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీ రు మున్నీరుగా విలపిస్తున్నారు. కోతుల విషయంపై గ్రా మపంచాయతీలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించు కున్న దాఖలాలు లేవని ప్రజలు పేర్కొంటున్నారు.

అబ్దుల్ బాసిత్‌కు ఉత్తమ జర్నలిస్టు అవార్డు

నవ తెలంగాణ - పటాన్ చెరు



పటాన్‌చెరు పట్టణానికి చెందిన అబ్దుల్ బాసిత్ చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా ఉత్తమ జర్నలిస్టు అవార్డు వరించింది. వివ రాల్లోకెళితే... భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(ఢిల్లీ), వే ఫౌండేషన్ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ వేదికగా బాసిత్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవ పురస్కార్ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ బాసిత్ మట్లాడుతూ తాను చేసిన సామాజిక సేవలను గుర్తించి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు అందజేసిన నిర్వహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మా గోడు ఆలకించండి

- భూ సమస్యలతో ప్రజావాణికి జనం
- ఎన్నిసార్లు తిరిగినా పరిష్కారం కాలేదు
- డబ్బునోళ్లకు అనుకూలంగా సర్వే
- తిరిగితిరిగి బేజారవుతున్న బాధితులు



ధరణి వచ్చాక పేదోళ్లకు భూ సమస్యలు పెరిగాయి. పట్టా భూములు, అసైన్డ్ భూములు ఏవైనా సరే తిప్పలొచ్చాయి. అసైన్డ్ చేయబడిన భూములే కాదు రిజిస్ట్రేషన్ అయ్యే పట్టా భూములకు సైతం అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. మా గోడు ఆలకించండి అంటూ జనం ప్రతివారం ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు. విచారిస్తామని చెప్పి పంపడం తప్ప భూ సమస్యను అధికారులు పరిష్కరిస్తున్నది లేదు. విచారిస్తామని, సర్వే చేయిస్తామని చెప్పడంతో బాధితులు అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. ఫిర్యాదులందిన భూముల్ని సర్వే చేస్తున్న అధికారులు భూస్వాములు, ధనికులు, కంపెనీలకు అనుకూలంగా రిపోర్టులిస్తుండడంతో గరీబోళ్లకు అన్యాయం జరుగుతోంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన దళితులు తమ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి కంచె వేస్తున్నాడని సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామానికి చెందిన కొనింటి రాజు, కొనింటి మరియమ్మ, కొనింటి ప్రభాకర్, దేవయ్య, భాస్కర్, కొనింటి నాగయ్యలకు చెందిన భూమిని పక్కన ఉన్న పట్టాదారు కబ్జా చేసి కంచె వేశాడు. తమ భూమిని సర్వే చేసి సరిహద్దులు చూపాలని కోరుతూ అధికారులకు దరఖాస్తు చేశారు. జిల్లా ఏడీ బాల్‌రాజు కొంత భూమిని సర్వే చేసి సర్వే నెంబర్ 124లో హద్దు చూపించారు. ఆ తర్వాత పక్క పట్టాదారు సుబ్బారావు భూమి సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మళ్లీ భూమిని సర్వే చేసిన ఏడీ 97 సర్వే నెంబర్‌లో హద్దు బండలు చూపించారు. రెండుసార్లు సర్వే చేసి రెండు రకాలుగా సరిహద్దులు నిర్ధారించడంతో దళితులకు పక్క పట్టాదారు అయిన సుబ్బారావుల మధ్య భూ వివాదాన్ని సృషించారని బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మారేపల్లికి చెందిన దళితులకు సర్వే నెంబర్ 124లో 9 ఎకరాల చిల్లర భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి ధరణిలో అన్ని వివరాలున్నాయి. పట్టాదారులకు రికార్డులపరంగా ఉన్న భూమి విస్తీర్ణపరంగా లేకుండా పోయింది. పక్కపట్టాదారు ధనికుడు కావడంతో సర్వేలో తప్పుడు సరిహద్దులు చూపించి దళితులకున్న భూమిలో కొంత సుబ్బారావు అనే వ్యక్తికి వస్తుందని రిపోర్టు ఇచ్చారు. పది కుటుంబాలకుపైగా ఆధారపడి ఉన్న దళితులకు చెందిన భూమిని సంపన్నులకు కట్టబెట్టేందుకు సర్వే అధికారులు సహకరిస్తున్నారని బాధితులు ప్రభాకర్, మరియ్య, నాగయ్య, బాస్కర్, శంకర్, అనంతయ్య నవతెలంగాణతో మొరపెట్టుకున్నారు. తమ భూమిని రీసర్వే చేసి రికార్డుల్లో ఉండబడిన భూమికి బౌండరీ చూపించాలని డిమాండ్ చేశారు.

సర్వే కోసం తిరుగుతోన్న రైతు

తమకున్న భూమిని సర్వే చేయాలని కోరుతూ ఓ రైతు ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టుకున్నా సర్వే అధికారులు పట్టించుకోవడంలేదంటున్నారు. కంగ్టి మండలంలోని జమ్గి(బి) గ్రామానికి చెందిన చిట్టెపు లింగారెడ్డి తనకున్న భూమిని సర్వే




చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సర్వే నెంబర్ 16, 12, 38, 57లలో లింగారెడ్డికి భూమి ఉంది. ఆ భూమిని ఎన్నో ఏళ్లు కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్నారు. పక్క పట్టాదారులు లింగారెడ్డికి ఉన్న భూమిలోంచి కొంత భూమి వస్తదంటూ గొడవ చేస్తున్నారు. దీంతో లింగారెడ్డి 2019లో భూమి సర్వే కోసం చలాన్ కట్టారు. భూమిని సర్వే చేసి సరిహద్దులు నిర్ధారించాలని ఆ రైతు కోరుతున్నారు. భూమి సర్వే కోసం ఎన్నోసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఆ రైతు పేర్కొంటున్నారు. గతంలో పని చేసిన ఎడీకి సర్వేకు వచ్చేందుకు డబ్బులు కూడా ఇచ్చినట్లు ఆ రైతు తెలిపారు. నాలుగేళ్లుగా తమ భూమిని సర్వే చేయాలని కోరుతూ ప్రజావాణి, ఏడీ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా పని కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని సర్వే చేయడకపోవడంతో పక్క పట్టాదారులతో గొడవలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తమ భూమిని సర్వే చేయాలని కోరుతున్నారు.

ధరణి తిప్పలు తొలగేనా?

ధరణి వల్ల తలెత్తిన భూ సమస్యలకు పరిష్కారం చూపడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని పలువురు బాధితులు పేర్కొంటున్నారు. ప్రతి సోమవారం భూమి కాగితాలు పట్టుకుని ఊర్ల నుంచి సుదూర ప్రయాణాలు చేసి దరఖాస్తులిస్తున్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్, ఆందోల్, సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో భూ సమస్యలతో బాధపడుతున్న వాళ్లు స్థానికంగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అక్కడ పట్టించుకోకపోవడంతో జిల్లా కేంద్రంలోని ప్రజావాణికి వచ్చి పిర్యాదు చేస్తున్నారు. ఒకటికి నాలుగు సార్లు తిరుగుతూ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటున్నారు. అయినా భూ సమస్యలు పరిష్కారం కావడంలేదు. తహసీల్దార్ల పని విధానం మెరుగుపడాలని కలెక్టర్ చొరవ తీసుకుని అందర్నీ బదిలీ చేశారు. ఒకరిద్దర్ని సస్పెండ్ చేశారు కొందరు ఏసీబీకి పట్టుబడ్డారు. అయినా సరే రెవెన్యూలో భూమి సమస్యలు తగ్గట్లేదు.

మా భూమి మాగ్గావాలే: నాగయ్య, మారేపల్లి



మా భూమి మాకే కావాలి. మా భూమిలో సుబ్బారావు అనే వ్యక్తికి భూమి ఉన్నట్లు సర్వేలో చూపించారు. ఇది తప్పుడు సర్వే. సర్వే చేసిన ఏడీ కావాలని సుబ్బారావుకు అనుకూలంగా సర్వే రిపోర్టు ఇచ్చారు. అంతకు ముందు సర్వే చేసి 124 సర్వే నెంబర్‌లోనే హద్దులు చూపించిన ఏడీ తర్వాత సర్వేలో మాత్రం 97 సర్వే నెంబర్‌లో చూపించారు. మా భూమిని సుబ్బారావుకు వస్తదని సర్వే చేసిన ఏడీ మరి మా దళితులకు ఉండాల్సిన 9 ఎకరాల భూమి ఎక్కడ ఉందో చూపించాలి.

పేదల భూ సమస్యల్ని పరిష్కరించడంలో నిర్లక్ష్యం: అతిమేల మాణిక్, సీపీఐఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



ప్రతివారం పేదలు తమ భూ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో రెండు మూడు సార్లు దరఖాస్తు చేస్తున్నారు. భూమి తక్కువ పడడం, సరిహద్దు వివాదాలు, సర్వే నెంబర్లలో తప్పులు దొర్లడం, భూములు కబ్జాకు గురికావడం, అసైన్డ్ చేయబడిన భూమిని తిరిగి గుంజుకోవడం, ధరణిలో నిషేధిత జాబితాలో చేర్చడం వంటి సమస్యల్ని అధికారులు నిర్ణీత కాలంలో పరిష్కరించాలి.

మా భూమి సర్వే చేయండి: లింగారెడ్డి, రైతు



మా భూమిని సర్వే చేసి సరిహద్దులు చూపించాలని దరఖాస్తు చేసిన. నాలుగేళ్లు అయినా సర్వే చేయట్లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పక్క పట్టాదారుతో గొడవలు జరుగుతున్నాయి. అధికారులు నిష్పక్షపాతంగా సర్వే చేసి సరిహద్దు చూపించాలని కలెక్టర్‌కు కూడా దరఖాస్తు చేశాను. ఏడీ కార్యాలయం నుంచి సర్వే చేసేందుకు రావట్లేదు. వెంటనే నా భూమిని సర్వే చేయాలి.

ఈటెల నీ మాటల తీరు మార్చుకో

తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి




నవ తెలంగాణ- గజ్వేల్

బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ మాటల తీరు మార్చుకోవాలని, లేకపోతే ప్రజా క్షేత్రంలో శిక్ష తప్పదని తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. సోమవారం గజ్వేల్ మండలం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూకబ్జాదారుడు ఈటెల రాజేందర్ అహంకారం మాటలతో పతనానికి మార్గం అవుతుందని చెప్పారు. మతతత్వ పార్టీలో మతిలేని మాటలు మాట్లాడుతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈటెల వంటి తిన్నింటి వాసాలు లెక్కబెట్టే వాళ్ల నోరు అదుపుతప్పి మాట్లాడుతున్నారన్నారు. ఈ నెల 21న గజ్వేల్ మండల టీఆర్ఎస్ పార్టీ సమ్మేళనం నిర్వహిస్తున్నమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, జడ్పీటిసి మల్లేశం, ఆత్మకమిటి చైర్మన్ ఊడేం కృష్ణ రెడ్డి,ప్యాక్స్ చైర్మన్ జె వెంకటేష్ గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు మద్ది రాజిరెడ్డి, సర్పంచ్ల ఫోరమ్ మండల అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణ గౌడ్, సమన్వయ సమితి సభ్యులు మద్దూరి శ్రీనివాస్ రెడ్డి, పండారి రవీందర్ రావు, వెంకట్ నర్సింహారెడ్డి, దయాకర్ రెడ్డి, చిన్న మల్లయ్య, రగుపతి రెడ్డి , సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, రమేష్ గౌడ్, గొడుగు స్వామి, భీమప్ప, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఆయా గ్రామ కమిటీల అధ్యక్షులు మండల అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాథ్ హైబ్రిడ్ వరిసీడ్స్ విత్తనాలతో అధిక దిగుబడులు

నవతెలంగాణ-మర్కుక్



నాథ్ హైబ్రిడ్ వరి సీడ్స్ విత్తనాలు సాగుచేయటం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని నాథ్ సీడ్స్ కంపనీ ఏజీఎం శివ ప్రసాద్‌రావు తెలిపారు. సోమవారం మర్కుక్ లో నాథ్ గజాబ్ హైబ్రిడ్ వరి రకం ను సాగు చేసిన నర్సింలు, మల్లేష్ గౌడ్ రైతుల పంట పొలాలలో క్షేత్ర పర్యటన గ్రామ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, కంపెనీ ప్రతినిధులతో కలసి క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా వారు నాథ్ గజాబ్ హైబ్రిడ్ వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు.అనంతరం నాథ్ సీడ్స్ కంపెనీ సిబ్బంది రైతులకు పంట రక్షణకు చేపట్టవలసిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ అఖిల్ సాయి, సైంటిస్ట్ డాక్టర్ విజయకుమార్, మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ ,మాజీ సర్పంచ్ మల్లేష్ గౌడ్, సుర్వీ బాలనర్సయ్య, శ్రీనివాస్ గౌడ్,ఎల్లం, రాజు,వెంకటేష్, తదితరులున్నారు.

బైతుల్ మాల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం


నవ తెలంగాణ-దుబ్బాక



గత పది ఏళ్లుగా పేద ముస్లింలకు ప్రతినెలా పెన్షన్లు, పేద ముస్లిం యువతుల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం, రంజాన్ మాసంలో తోఫాల పంపిణీ వంటి అనేక కార్యక్రమాల ద్వారా బిస్మిల్లా బైతుల్ మాల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ (కె ఆర్ ఆర్)చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు కొనియాడారు. పేద ముస్లిం కష్టాల్లో అండగా నిలుస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు ఎండి.చాంద్ మియాను ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో "బిస్మిల్లా బైతుల్ మాల్ (ట్రస్ట్" ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ కిట్లను ట్రస్టు అధ్యక్షుడు చాందిమియా, వైస్ ప్రెసిడెంట్ ఖదీర్ అలీ, తహసీల్దార్ ఎండి.సలీం మియా,సిఐ మున్నూరు కృష్ణ,భూమ్ పల్లి ఎస్ఐ గంగరాజు లతో కలిసి వంశీధర్ రావు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. షబ్బీర్ మియా, సెక్రెటరీ జమీల్, జలీల్, తంజిల్ రెహమాన్, అబ్దుల్ రహీం, ఇజాజ్ పటేల్ ఉన్నారు.

ప్రజాసేవే ఎస్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం

నవ తెలంగాణ గజ్వేల్




ప్రజాసేవే ఎస్ఆర్ ఫౌండేషన్ లక్ష్యమని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్ అన్నారు. సోమవారం గజ్వేల్ టిపిటిఎఫ్ భవన్లో ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ జర్నలిస్ట్ బందారు రాజు. జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశ బోయిన నర్సింహులు, టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, టి పి టి ఎఫ్ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్ హాజరయ్యారు. ఎస్ ఆర్ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న సుమన్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. దుబ్బాక మండలం లచ్చపేట గ్రామానికి చెందిన మహమ్మద్ షాహిన్ కుటుంబానికి నిత్యవసర సరుకులు బియ్యం ఆర్థిక సహాయం అందజేశారు. ముఖ్య అతిథులకు ఎస్ఆర్ ఫౌండేషన్ పక్షాన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ ఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు మహమ్మద్ ముబాసిర్ ప్రధాన కార్యదర్శి పుట్టా రాజు కోశాధికారి మహమ్మద్ ఉమర్, ఆర్గనైజర్ వెంకటేష్ టి పి టి ఎఫ్ నాయకులు వరప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

నవతెలంగాణ జహీరాబాద్





ఆత్మహత్య చేసుకోవడానికి విషం సేవించిన యువకుడిని భుజాలపై మూసుకొని వచ్చి సరైన సమయానికి ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ ఉదంతం సోమవారం చోటు చేసుకుంది. జహీరాబాద్ నియోజకవర్గం అల్గోల్ గ్రామం నుంచి 100 నెంబర్‌కు ఆదివారం రాత్రి తన అన్న రాజు తండ్రి నర్సింలు ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ చేశాడు. తర్వాత ఫోన్ చేస్తే లేపడం లేదు. అన్న ఆచూకీ కనిపెట్టి కాపాడాలని అల్గోల్ గ్రామవాసి నర్సింలు కూతురు మహేశ్వరి ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు బాధితుడి ఫోన్ నెట్వర్క్ ఆధారంగా ఆచూకీ కనుగొన్నారు. బాధితుడి వద్దకు చేరుకోగా అతడు మద్యంలో విషపదార్థాలు కలుపుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. బాధితుడు రాజు విషం సేవించిన ప్రాంతం అల్గోల్ అడవి ప్రాంతం. అక్కడికి వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. బాధితుడు కొన ఊపిరిపై ఉండడం గమనించిన కానిస్టేబుల్ జైపాల్ వెంటనే అతన్ని తన భుజంపై మోసుకొని వచ్చి పోలీసు వాహనంలో ఎక్కించాడు. వెంటనే అక్కడి నుంచి జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. వైద్యులు విషానికి విరుగుడు మందు ఇచ్చి రాజు ప్రాణాలు కాపాడారు. సరైన సమయానికి ఆసుపత్రికి తేవడం ద్వారానే బాధితుడు బతికాడని, మరో పది పదిహేను నిమిషాలు అలస్యమయితే అతని ప్రాణం పోయేదని అన్నారు. రాజు ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ నాయిని జైపాల్, సిబ్బందిని డీఎస్పీ రఘు, సర్కిల్ ఇన్స్పెక్టర్ తోట భూపతి, ఎస్సై శ్రీకాంత్ తదితరులు అభినందించారు.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- పట్టణంలో 148 మంది లబ్ధిదారులకు 58, 59 జీఓ కింద ధృవీకరణ పట్టాలు పంపిణీ చేసిన మంత్రి

నవ తెలంగాణ - సిద్దిపేట

సద్దితిన్న రేవు తలవాలని, మీరు కబ్జాలో ఉన్న భూమిపై సర్వహక్కులు కల్పించిన సీఎం కేసీఆర్, పనిచేసే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా జరగని పనిని, పూర్తి చేయించి మిమ్మల్ని ఇంటికి పిలిపించి, మీ చేతికి పట్టా అందించి, భోజనం పెట్టించి పంపిస్తున్నామని తెలిపారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం పట్టణంలోని 148 మంది లబ్దిదారులకు 58, 59 జీఓ కింద ధృవీకరణ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో తెలిసో, తెలియక ఇళ్లు కట్టుకున్న కొంతమంది ఎన్నో ఏళ్లుగా భయభ్రాంతులతో ఆ భూమిపై హక్కు లేక ఆందోళన చెందుతున్నారని, ఇక నుంచి మీ భూమి పై మీకు సర్వ హక్కులు కల్పించేలా ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఇప్పటి వరకూ సిద్దిపేటలో 569 మందికి 59 జీఓ కింద పట్టాలు అందజేసినట్లు తెలిపారు. ఆకుపచ్చ, ఆరోగ్య సిద్దిపేట కావాలన్నదే నా కల అని, నా ప్రయత్నమని, ప్రజలు ఆనందంగా ఆరోగ్యంగా బతకాలన్నదే తపన అని అన్నారు. పట్టణంలో యూజీడీ పూర్తి చేశామని, పందులు, పశువుల బెడద తొలగించామని, ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి, హానికరమైన చెత్త వేర్వేరుగా చేసి ఇవ్వాలని, అలాగే ప్రతీ ఇంటి ముందు చెట్లు నాటి సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఏలా మారిందో.. మీరే గమనించాలని సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను



వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నేతలు, జర్నలిస్టులు నిత్య విద్యార్థులు

జర్నలిస్టులు, పోలీస్, పొలిటీషియన్లపై ఎవరి సానుభూతి ఉండదని, రాజకీయ నేతలు, జర్నలిస్టులు నిత్య విద్యార్థులని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రెడ్డి సంక్షేమ సంఘంలో సుమారు 72 మంది జర్నలిస్ట్ కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తానని, వెనెలేస్ సెంటర్‌లో త్వరలోనే ఎంబీబీఎస్ డాక్టర్‌ను నియమిస్తమని, త్వరలోనే లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ చేస్తామన్నారు. మీడియా అనేది ఛాలెంజింగ్‌తో కూడుకున్నదని, యాజమాన్యాల తీరువల్ల జర్నలిస్టులు చితిగిపోతున్నారని అన్నారు. నేను జర్నలిస్ట్ బాధలను చాలా దగ్గరగా ఉండి చూసానని, ఉమ్మడి జిల్లాలో జర్నలిస్ట్ లందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ చేస్తామని, భవిష్యత్‌లో జర్నలిస్ట్ ల కోసం శాయశక్తులా సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సభా వేదికగా మంత్రి క్షమాపణ

ప్రేమ పొందే చోట అధికారుల పుణ్యమా అని నేను తిట్లు తింటున్న. వికలాంగుల ఉసురు పోసుకోవద్దు. మళ్లీ ఇలాంటివి తిరిగి పునరావృతం కాకుండా చూడాలి. నా రెండు చేతులు జోడించి జిల్లా సంక్షేమ శాఖ అధికారికి రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నమస్కారం చేశారు. సిద్దిపేట బాల సదనంలో రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ






చైర్మన్ వాసుదేవ రెడ్డితో కలిసి 150 మంది వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ చారు. మంత్రి పర్యటన షెడ్యూల్ మేరకు సంబంధించిన శాఖ అధికారులకు మధ్యాహ్నం మూడు గంటలకు సమయం కేటాయించారు. అధికారులు సంబంధిత లబ్దిదారులను ఉదయం 10 గంటలకు నిర్దేశిత సభా స్థలానికి తీసుకొచ్చారు. మంత్రి బిజీ షెడ్యూల్ వల్ల నిర్ణీత సమయం 3 గంటలకు బదులుగా అరగంట ఆలస్యంగా వచ్చారు. రాగానే గంటల తరబడి వేచి చూస్తున్న విషయం తెలుసుకున్న మంత్రి ముందుగా లబ్దిదారులైన వికలాంగులకు చేతులు జోడించి క్షమాపణ చెప్పారు. అధికారుల అత్యుత్సాహం, వారి నిర్వాకం వల్ల మీరు వేచి ఉండేలా పరిస్థితి అయ్యిందని, మిమ్మల్ని నిర్ణీత సమయం కంటే ముందుగా పిలిచి ఇబ్బందులు పెట్టిన అధికారుల తరపున చేతులు జోడించి క్షమాపణలు కోరారు. భవిష్యత్తులో ఇలా వికలాంగులకు ఇబ్బందులు పెట్టొద్దని, సాయం చేసిన చోట మీతో తిట్లు తిట్టించుకునే పరిస్థితి వచ్చిందని, అధికారుల పుణ్యమా అని ప్రేమ పొందే చోట మీ మనస్సు బాధ పెట్టినందుకు నన్ను క్షమించాలని మంత్రి హరీశ్‌రావు వికలాంగులను కోరారు. దీంతో అక్కడి వికలాంగులు మా సంక్షేమం కోసం పాటు పడుతున్న సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కోసం ఎంత సమయమైనా వేచి చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.


మైనార్టీలకు కాంగ్రెస్ అండ


నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అప్పుడు ఇప్పుడు ఎప్పుడైనా అండగా ఉంటుందని ఎఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మాణిక్‌రావు థాక్రె అన్నారు. సోమవారం సంగారెడ్డి ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మిలాన్‌గ్రౌండ్‌లో ముస్లీం మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వేలాది మంది ముస్లీం మైనార్టీలకు రంజాన్ పండుగ ఉపవాసాల సందర్భంగా జగ్గారెడ్డి ఏర్పాటు చేసి ఇఫ్తార్‌కు కాంగ్రెస్ పార్టీకి చెందిన జాతీయ, రాష్ట్ర ముఖ్య నాయకులు హాజరై పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు ప్రారంభానికి ముందు ముస్లీంనుద్దేశించి మాణిక్ థాక్రె మాట్లాడారు. దేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఇఫ్తార్ విందుకు హాజరయ్యానని, సంగారెడ్డిలో జరిగినంత గొప్పగా ఎక్కడా చూడలేదన్నారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి తనను ఇఫ్తార్ విందుకు పిలవాలని ఆకాంక్షించారు. ముస్లీం సోదరులకు రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారొద్దీన్, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగ్గారెడ్డి ఎప్పుడూ ఎమ్మెల్యేగానే ఉండాలని ఆశిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు అందరం మైనార్టీలకు అండగా నిలుస్తున్నామన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ ఎప్పుడూ ఇలానే ఇఫ్తార్ విందు ఇవ్వాలని ఆ దేవుడిని కోరుకుంటున్నాని ఆయన పేర్కొన్నారు. సంగారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎఐసీసీ సెక్రటరీలు నాదిమ్ జావిద్, రోహిత్ చౌదరి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కీ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు హనుమంతారావు, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కుసుమకుమార్, గాలి అనిల్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, మెట్టు సాయికుమార్, జనరల్ సెక్రటరీ జగదీష్, పున్నారెడ్డి, సురేష్ షెట్కార్ తోపాజీ అనంతకృష్ణ, అంకని ప్రవీణ్‌కుమార్, బుచ్చి రాములు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోలను సేర్ఫ్ ఉద్యోగుల గుర్తించే వరకు పోరాటం





సంగారెడ్డి డీఆర్డీఏ ఆఫీసు ముందు వీవోఏల సమ్మెను ప్రారంభించిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి, పటాన్‌చెరు

ఐకేపీ వీవోలను సేర్ఫ్ ఉద్యోగుల గుర్తించే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. సంగారెడ్డి డీఆర్డీఏ ఆఫీసు ముందు, పటాన్ చెరు మండల పరిషత్ కార్యాలయం ముందు వీవోఏల సమ్మెను సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలు 19 సంవత్సరాల నుంచి పని చేస్తున్నా కనీస వేతనం సౌకర్యాలు ఎందుకు అమలు చేయడం లేదన్నారు. అనేక సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తెచ్చిన పరిష్కారం కాలేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. సేర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించే వరకు ఈ పోరాటం ఆగదన్నారు. మరో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తున్న వీవోఏలు ప్రభుత్వ సమావేశాలు, సభలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసే దాంట్లో కీలకపాత్ర పోషిస్తున్న వీరికి ఎందుకు కనీస వేతనం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వీవోఏలు అడుగుతున్నది గొంతెమ్మ కోరికలు కాదని, కష్టపడుతున్న మాకు ప్రభుత్వం రూ.3,900 చెల్లిస్తుంటే ఎలా జీవిస్తారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిత, కంది సంగారెడ్డి మండలాల నాయకులు వీరేశం, అనిత భాగ్యలక్ష్మీ, ఉమ, సుమలత, సీఐటీయూ జిల్లా ఉపదక్షులు నాగేశ్వరరావు, కోశాధికారి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం



నవతెలంగాణ-ఝరాసంగం

ప్రజల దాహార్తిని తీర్చడం కోసం స్వచ్ఛందంగా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గల వీరభద్ర ఫర్టిలైజర్స్ అండ్ ఫెర్టిసైడ్స్ దుకాణ ముందు హనుమన్న పటేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలివేంద్రాన్ని ప్రారంభించడం ఎంతో అభినందనీయమని.. దీని ద్వారా వివిధ గ్రామాల ప్రజలతోపాటు వాహనదారులకు ఎంతో ఉపయోగపడ ుతుందని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఈశ్వర్ పాటిల్, విజయ్ కుమార్ పాటిల్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు జగదీశ్వర్, ప్యారవరం ఉపసర్పంచ్ మాణిక్ యాదవ్, జాగృతి కన్వీనర్ పాండు, శ్రీనివాస్, బసప్ప, సంగమేష్, కంబాలపల్లి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ జర్నలిస్టులకు ప్రమాద బీమా పాలసీలు అందజేత



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా యూజెఎఫ్ ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్టుల కోసం పది లక్షల రూపాయల ప్రమాద బీమా పాలసీలను టీఎస్‌పీఎస్సీ కమిటీ మెంబర్ ఆర్. సత్య నారాయణ మరియు టీయుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యదర్శి ఎంకే. ఫైసల్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎం.కె. ఫైసల్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు అనునిత్యం వార్తా అన్వేషణలో భాగంగా ఇతర చోట్ల ప్రయాణిస్తున్న నేపథ్యంలో కొంతమంది జర్నలిస్టులు రోడ్డు ప్రమాదాలకు గురై చనిపోతున్నారన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవడం లేదని దానికోసమే యూజేఎఫ్ రూ.10 లక్షల ప్రమాద బీమాను జిల్లాలోని ప్రతీ ఒక్క ఉర్దూ జర్నలిస్టుకు చేయించిందన్నారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హాజీ అలీ, జహీరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ మిణజ్, సీనియర్ జర్నలిస్టులు మసూద్‌ఖాన్, మహమ్మద్ సిద్దిక్, ఎం ఏ.మతిన్, ఆరిఫ్, అక్మల్‌తో పాటు జిల్లా ఉర్దూ ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



రాములన్నను గెలిపించండి.. మేమంతా అండగా ఉంటాం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని మహేంద్ర పరిశ్రమ యూనియన్ ఎన్నికల్లో టీఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు రాములు యాదవ్‌ను గెలిపిస్తే తామంతా అండగా ఉంటామని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మంత్రి హరీశ్‌రావు అండతో పరిశ్రమలోతో పాటు బయట కార్యక్రమాలకు కూడా తమ అండ ఉంటుందన్నారు. కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉన్న నాయకుడిని ఎన్నుకుంటే వారి సమస్యలు ఇట్టే పరిష్కారం అవుతాయని అన్నారు. సీడీసీ చైర్మెన్ ఉమాకాంత్ పాటిల్ మాట్లాడుతూ.. అందరికీ అందుబాటులో ఉండే నాయకుడు రాములు యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాములు యాదవ్ మాట్లాడుతూ.. ఇటీవలే గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలని.. మహేంద్ర కార్మికులు కూడా భారీ మెజార్టీతో గెలిపిస్తారని నమ్మకం తనకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నామాల రవి కిరణ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఎంఆర్ఎఫ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నర్సింలు యాదవ్, నాగేష్ రాములు, రాజు, మచందర్, బాబి, శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మాజీమంత్రి గీతారెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జహీరాబాద్

మాజీ మంత్రి గీతారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శుభాష్ గంజ్ ఆవరణలో కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీపీ ఏం.గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యం కారణంగా జన్మదిన వేడుకలకు గీతారెడ్డి హాజరుకాలేకపోయారన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు ఖండ్యాం, నర్సిములు, పి.నర్సింహారెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, మొహ్మద్ మాక్సుద్ అహ్మద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సామెల్, మీర్జావీద్, వినీల నరేష్, ఎస్సీ సెల్ వైస్ చైర్మెన్ భీమయ్య, కన్వీనర్ రాచప్ప, గోపాల్ చిన్న, అక్బర్ హుస్సేన్, వీరారెడ్డి, శుక్లవర్ధన్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, చెందర్‌నాయక్, మాజీ కౌన్సిలర్లుతాహెరాబేగం, నాసురుల్లాఖాన్ పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల గ్రామ కమిటీ యువజన విభాగం అధ్యక్షులు చిరుమని భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ గ్రామ నాయకుల ద్వారా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెల్సుకుని.. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే తక్షణ సహాయార్థం కింద రూ.25వేలు ఆయన తనయుడు విక్రం రెడ్డితో అందజేయించారు. జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, సీజీఆర్ ట్రస్ట్ చైర్మెన్ గోవర్ధన్ రెడ్డి, నాయకులు సద్ది విజయభాస్కర్ రెడ్డి,నక్క వెంకటేష్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్, బీఆర్ఎస్వీ అధ్యక్షులు కానోజి రాము, ప్రవీణ్ రెడ్డి, కర్ణాకర్ గౌడ్, వార్డ్ మెంబర్ రాము, శ్రీకాంత్ చారి, నల్తూరు యాదగిరి, దీక్షిత్, యువకులు తదితరులు ఉన్నారు.



దామర చెరువులోకి నీటిని మళ్లించాలి

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామ దామర చెరువులోకి ఆరేళ్లుగా నీటి సరఫరా లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. సోమవారం చింతకుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అన్నా సాగర్ చెరువు నుంచి దామరచెరువులోకి నీరు ప్రవహించేదని, పాలకులు అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ తూములు కూరుకుపోయి ఆరేళ్లుగా నీటి సరఫరా బంధు అయిందన్నారు. దీంతో బోర్లు ఎండిపోతున్నాయని, పంటలు కూడా పండించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ చెరువులోకి నీరు వచ్చి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



క్రీడాకారులకు వాలీబాల్, క్రికెట్ క్రీడా సామాగ్రి వితరణ

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని అనంతరం, నల్లవల్లి గ్రామంలో గల క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తనయుడు గూడెం విక్రం రెడ్డి వాలీబాల్, క్రికెట్ క్రీడా సామగ్రిని యువకులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత క్రీడలలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని.. వారికి ఎల్లవేళలా తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్న పాపని కుమార్ గౌడ్, సద్ది విజయ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, సిజిఆర్ ట్రస్ట్ చైర్మెన్ గోవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నక్క వెంకటేష్ గౌడ్, మండలాధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్, నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ మొగులయ్య, దేవేందర్ రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

సీఐటీయూతోనే మహీంద్రా కార్మికుల జీవితాల్లో వెలుగులు

- కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు.. ఇతర సౌకర్యాలు
- వరుస విజయాలతో చరిత్రను తిరగరాసిన చుక్కరాములు
- ఈసారి కూడా సీఐటీయూదే విజయం
- యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమ కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ గెలుపొందిన తర్వాతే కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయి. కార్మికుల సమస్యలు తమ సమస్యలుగా భావించి.. నిరంతరం వాటి పరిష్కారానికే తమ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు కృషి చేశారు. మెరుగైన ఒప్పందాలు, ఇంక్రిమెంట్లతో పాటు కార్మికుల కోసం అనేక సౌకర్యాలను ఏర్పాటు చేసి.. చరిత్రను తిరగరాశారు.' అని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. మహీంద్రా అండ్ మహీంద్రాలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఆయన నవతెలంగాణతో ప్రత్యేకంగా ముచ్చడించారు.

2007లో మొదటిసారి ఈ పరిశ్రమలో పి.జనార్ధన్‌రెడ్డిపై 46 ఓట్ల మెజార్టీతో సీఐటీయూ విజయం సాధించింది. 2010లో విష్ణువర్ధన్ రెడ్డి పై 37 ఓట్లతో, 2013లో మంత్రి హరీశ్‌రావుపై 45 ఓట్ల మెజార్టీతో, 2018 జూన్ నెలలో జరిగిన ఎన్నికల నుంచి నేటివరకు వరుసగా సీఐటీయూ గెలుపొందుతూనే ఉన్నది. కార్మిక చట్టాల పట్ల మంచి అవగాహన ఉన్న చుక్క రాములు అధ్యక్షుడిగా నిలబడడంతోనే ఈ విజయాలు వచ్చాయనడంలో సందేహం లేదు. అయితే 2007లో గెలచినప్పుడు పరిశ్రమలో పర్మి నెంట్ కార్మికుల సంఖ్య కేవలం 460 మాత్రమే.. కానీ నేడు పరిశ్రమలో 585 మంది పర్మినెంట్ కార్మికులు, 270 మంది అప్రెంటిస్‌లు, 1300 మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. గతంలో పాలించిన యునియన్లు తాకట్టు పెట్టిన కార్మికుల ప్రయోజనాలను కూడా సీఐటీయూ వచ్చిన తర్వాత కార్మికులకు తిరిగి ఇప్పిం చాం. కార్మికుల పిల్లలు 10 పాసయిన వారికి పరిశ్రమలో కార్మికులుగా నియమిం చడంతో ఎంతో మంది కార్మికుల కుటుంబాల్లో వెలుగు నిండాయి. 2019లో 27.5 ఎకరాల్లో మహీంద్రా స్టార్ సిటిని ఏర్పాటు చేసి 314 మంది కార్మికులకు ప్లాట్లు ఇప్పించాం. నాడు ఒక్కో కార్మికుడి దగ్గర రూ.3.85 లక్షలు మాత్రమే తీసుకున్నాం. నేడు మేము చేసిన వేతన ఒప్పం దాలతో సినియర్ కార్మికుడికి నెలకు రూ.73 వేలు, జుని యర్ కార్మికుడు రూ.46,250 వేతనాన్ని పొంద ుతున్నాడు. అంతేకాకుండా కాంట్రాక్టు కార్మికులకు కూడా కనీస వేతన ఒప్పందం ఇప్పిచ్చి చరిత్ర సృష్టించాం. కార్మికులకు ఫ్రీహెల్త్ ఇన్సురెన్స్ కార్డులను రూ.3 లక్షల వరకు పెంచాం. సంగారెడ్డి నుంచి జహీరాబాద్‌కు కార్మికులకోసం బస్సుసౌ కర్యాన్ని కల్పించాం.



ప్రమోషన్ పాలసిలో 4 ఇంక్రిమెంట్లు ఇప్పించాం. ప్రయివేటు పరిశ్రమలో కార్మికుల రిటైర్మెంట్ వయస్సును 58 నుంచి 60 సంవత్సరాలకు పెంచిన ఘనత కూడా సీఆర్ కే దక్కుతుంది. గ్రూపు పర్సనల్ పాలసీని రూ.7లక్షల నుంచి 8 లక్షలకు పేంచినట్లు తెలిపారు. బ్యాక్ టు బ్యాక్ అగ్రిమెంట్‌లను నిర్వహించడంతో కార్మికులు ఒక గంట కూడా కోల్పోలేకపోయారు. పరిశ్రమలో గత యూని యన్‌లు రద్దు చేసిన రిక్రూట్‌మెంట్ పాలసీని తిరిగి ప్రారం భించడంతో నేటికి 100 మందికి పైగా కార్మికులను పర్మినె ంట్ చేయడం జరిగింది. ఇతర యూనియన్లు 7 అగ్రిమెంట్లు చేసి కేవలం రూ.13 చిల్లర మాత్రమే పెంచగా.. మా యూనియన్ కేవలం 3 అగ్రిమెంట్లలో రూ.36 వేలకు పెంచ డం జరిగింది. డీఏ 1.80 నుంచి 3.25 కు పెంచడంతో ప్రతీ కార్మికుడికి రూ.1800 లాభం చేకూరింది. అందరి సహకారంతోనే ఇన్ని విజయాలు సాధించగలిగాం. కాబట్టి ఎన్నికల్లో కూడా కార్మికులు మంచి మెజార్టీతో చుక్క రాములునే గెలిపిస్తారని కోరుకుంటున్నాం.

అంతర్జాతీయ స్థాయికి మహీంద్రా పరిశ్రమ...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు క్యాబినెట్ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా కొనసాగిన దివంగత నేత పి.ఇంద్రారెడ్డి1985 సంవత్సరం ఆల్విన్ నిస్సాన్ పేరుతో 26 శాతం ప్రభుత్వ వాటా ధనంతో నిస్సాన్ డిసిఎం వాహన తయారీ రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమగా ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత మారినా ప్రభుత్వాల నేపథ్యంలో దేశంలో, రాష్ట్రంలో అనూహ్యంగా చోటు చేసుకున్న నూతన ఆర్థిక పారిశ్రామిక విధానం అమలు కారణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రైవేటు పెట్టుబడి సంస్థలకు అనేక రకాల రాయితీలు కల్పించి ఎర్రతివాచీతో స్వాగతం పలికాయి. ఆ తర్వాత అనూహ్యంగా చోటుచేసుకున్న పారిశ్రామిక రంగం మార్పుల కారణంగా ప్రభుత్వ వాటా ధనాన్ని పూర్తిగా విరమించుకుని, మహీంద్రా కర్మాగారంగా రూపాంతరం చెందిన ఆనాటి పూర్వపు ఆల్విన్ నిస్సాన్ పరిశ్రమను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేశారు. ఆ తర్వాత వాహనాల ఉత్పత్తి రంగంలో తిరుగులేని మహారాజులా దూసుకుపోతున్న మహేంద్ర పరిశ్రమ మహీంద్రా అండ్ మహీంద్రా గా మరో ఉమ్మడి అడుగు ముందుకేసి భారీ తరహా వాహనాలను అంతర్జాతీయ స్థాయి నాణ్యత ప్రమాణాలతో పోటాపోటిగా ఉత్పత్తి చేయడం విశేషం. ఏది ఏమైనప్పటికీ అధికార పార్టీ బీఆర్ఎస్, అనుబంధ కార్మిక సంఘం మహీంద్రా రియల్ వర్కర్స్ యూనియన్ - 225/2015 బస్సు గుర్తుతో ప్రముఖ సంఘసేవకులు, ఎంపీటీసీ సభ్యులు హుగ్గెల్లి ఎంజి రాములు, సీపీఐ(ఎం) అనుబంధ కార్మిక సంఘం మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)-3107 చుక్క గుర్తుతో చక్కరాములు కార్మిక యునియన్ నాయకులుగా కొనసాగుతున్నారు.

ప్రధానమంత్రి బీమా పథకాల్లో అర్హులందరూ నమోదవ్వాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలలో అర్హులందరూ నమోదయ్యేలా ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో పంచాయితీ, గ్రామీణ అభివృద్ధి అధికారులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తో గ్రామ పంచాయతీ స్థాయిలో పీఎంజెజెబివై మరియు పిఎంఎస్‌బీవై నమోదుకు ప్రత్యేక శిబిరాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంనకు 18 నుండి 50 ఏండ్లలోపు వయస్కులు అర్హులన్నారు. బ్యాంక్ అకౌంట్ కలిగిన వారందరూ సంవత్సర బీమా ప్రీమియం రూ. 436లు చెల్లించాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి 18 నుండి 70 ఏండ్ల వయస్సు వారందరూ అర్హులని, సంవత్సర బీమా ప్రీమియం రూ.20గా ఉంటుందన్నారు. ఈ బీమా పథకాలకు ఇన్సూరెన్స్ కాలపరిమితి(జూన్ 1 నుండి మే 31వరకు) ఒక సంవత్సరం వరకు ఉంటుందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన లేదా శాశ్వత, పాక్షికంగా వికలాంగత్వం కలిగినా ఈ బీమా వర్తిస్తుందన్నారు. ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా రెండు లక్షల రూపాయలు, పాక్షిక అంగవైకల్యం కలిగితే ఒక లక్ష రూపాయల బీమా లభిస్తుందన్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి బ్యాంక్ మేనేజర్ కోఆర్డినేషన్తో ఖరారు చేసిన తేదీలలో క్యాం పులను నిర్వహించి అర్హులైన వారందరినీ ఆయా పథకాలలో నమోదు చేయించాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌తో సహా ఇతర ప్రజాప్రతినిధులందరికి క్యాంపు వివరాలు తెలియచేయాలన్నారు. క్యాంప్ నిర్వహణకు రెండ్రోజుల ముందుగా గ్రామాల్లో టాం టాం వేయించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని పంచాయితీ అధికారికి సూచించారు. ప్రతి గ్రామంలో స్వయం సహాయక మహిళా సంఘాలను చైతన్య పరిచి, ఆయా జన సురక్ష పథకాలలో నమోదయ్యేలా చూడాలని సూచించారు. బ్యాంకు వారీగా వివరాలను ప్రతివారం తీసుకోవాలని ఎల్‌డిఏంకు సూచించారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం గోపాల్ రెడ్డి, డిఆర్‌డిఓ శ్రీనివాసం రావు, ఇంచార్జ్ పంచాయితీ అధికారి పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నవతెలంగాణ-జహీరాబాద్

కోహీర్ మండలం బాడంపెట్ గ్రామానికి చెందిన ఎం.డి మోసిన్‌కు రూ.18,000 సీఎం సహాయ నిధి డబ్బులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును క్యాంపు కార్యాలయంలో లబ్దిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మెన్ ఉమకాంత్ పాటిల్, సర్పంచ్ రవి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఏర్పాటుతోనే ప్రజల బతుకులు మారాయి

- జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే ప్రజల బతుకులు మారాయని సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌లు అన్నారు. సోమవారం అందోల్, పుల్కల్, చౌటకూర్, టేక్మాల్ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్దిదారులకు సుమారుగా రూ.3 కోట్ల విలువగల 365 చెక్కులను, రంజాన్ పండగ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ లో గత పాలకులు అభివృద్ధి చేయలేకపోయారని, సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. తాగునీటి సమస్యతో మహిళలు బిందెలతో రోడ్లపైకి వచ్చేవారని, మిషన్ భగీరథ తో ఇంటింటికీ నల్ల కనెక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. రైతుల సమస్యలను కూడా పూర్తిగా పరిష్కరిస్తున్నామన్నారు. జోగిపేటలో 500 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందజేశామన్నారు. స్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద నిధులు మంజూరు చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు విడుదల చేయకపోయినా సీఎం కేసీఆర్ సమర్థవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, అందోల్ తహసిల్దార్ వెంకటేశం, డిప్యూటీ తహసిల్దార్ మధుకర్ రెడ్డి, ఎంపీపీ బాలయ్య, వైస్ ఎంపీపీ మహేశ్వర్ రెడ్డి, జోగిపేట మాజీ మార్కెట్ చైర్మెన్‌లు నారాయణ, మల్లికార్జున గుప్తా, నాగభూషణం, మాజీ ఎంపీపీ రామా గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్, ఆయా మండ లాల పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, విజయ్ కుమార్, శివకుమార్, వీరప్ప,,సార శ్రీధర్, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు లింగా గౌడ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అశోక్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశం, గోపాల్ రావు, మాణిక్యరెడ్డి, నాగరాజు, అర్పత్, కాజా పాషా, ఖలీల్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.



సర్వ మతాలకు సమ ప్రాధాన్యత

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఆలయం, చర్చి, మసీదులకు రూ.10 లక్షల చొప్పున విరాళం

నవతెలంగాణ-అమీన్‌పూర్

ఒకే రోజు దేవాలయం, చర్చి, మసీదు నిర్మాణాలకు శంకుస్థాపన చేసి రూ.10 లక్షల చొప్పున రూ.30 లక్షల విరాళాలు ప్రకటించి పరమత సహనానికి మారుపేరుగా నిలిచారు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. అమీన్పూర్ మండలం పటేల్ గూడ గ్రామ పరిధిలోని బిహెచ్ఇఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో నూతనంగా నిర్మించ తలపెట్టిన పోచమ్మ దేవాలయం, మసీదు, చర్చి నిర్మాణ పనులకు ఆదివారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ శంకు స్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొం దిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. పురాతన ఆలయాలను జీర్ణోద్ధారణ చేయడంతో పాటు నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ ఆర్థిక సహకారం అందిస్తున్నామన్నారు. వీటితో పాటు నూతన మసీదులు, ఆశీర్ఖానాలు, దర్గాలు, చర్చిలు నిర్మిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించడంలో ప్రార్థన స్థలాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, సర్పంచ్ నితీశా శ్రీకాంత్, ఉప సర్పంచ్ జానకి జ్ఞానేశ్వర్, స్థానిక ప్రజాప్ర తిని ధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేతలు అడ్డగింత

- రెవెన్యూ అధికారులపై కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆగ్రహం
- ఎమ్మెల్యే చొరవతో నిలిచిన కూల్చివేత



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో 59 జీ.వో కింద పేద ప్రజలు నిర్మించుకున్న ఇండ్లను కూల్చడానికి రెవెన్యూ యంత్రాంగం సోమవారం చర్యలు తీసుకోగా.. వెంటనే స్పందించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, స్థానిక కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అధికారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో కూల్చివేతలు సరికాదని మాట్లాడారు. జీ.వో కింద ఇళ్ల స్థలాల క్రమబ ద్ధీకరణకు సంబంధించి భారీగా పెంచిన రుసుమును చెల్లించడం పేద ప్రజలకు సాధ్యం కాదన్నారు. కూల్చివేతలు ఆపాలంటూ పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి ఫోన్లో చంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చొరవతో రెవెన్యూ అధికారులు పేదల ఇళ్ల స్థలాల వద్దకు రావద్దని హెచ్చరించడంతో వెనక్కి తగ్గారు. ఇరవై రోజుల పాటు కూల్చివేతలు చేయొద్దంటూ ఎమ్మెల్యే అధికారులకు సూచించినట్టు కౌన్సిలర్ తెలిపారు. కాగా పేద ప్రజల సమస్యలు పట్టించుకొని, కూల్చివేతలు ఆపివేయడం పట్ల స్థానికులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి, స్థానిక కౌన్సిలర్ చంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు కౌన్సిలర్ చంద్రయ్య ,పాస్టర్ శంకర్, రత్నం, డిప్యూటీ తాసిల్దార్, మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది, గాంధీనగర్ వాసులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏలకు కనీస వేతనమివ్వాలి









నవతెలంగాణ-కొండాపూర్,సదాశివపేట,జోగిపేట,మునిపల్లి

ఐకేపీ వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రతా కల్పించడంతో పాటు సమస్యలను వెంటనే పరిష్కరించాని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట వీవోఏలు నిరసన కార్యక్రమాలు ప్రారంభించారు. అందులో భాగంగా కొండాపూర్ తహసీల్దార్ కార్యాలయం, సదాశివపేట ఎంపీడీఓ కార్యాలయం, జోగిపేట తమసీలల్దార్ కార్యాలయం, మునిపల్లి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏలు సోమవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా కొండాపూర్‌లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, సదాశివపేటలో జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్, జోగిపేటలో డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, మునిపల్లిలో వీఓఏల సంఘం సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాము మాట్లాడుతూ.. వీవోఏల సమస్యలు పరిష్కారం చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 21 నుండి ఏప్రిల్ 16 వరకు ఆన్‌లైన్ సేవలు బంద్ చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. వీవోఏలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయిస్తున్నాయని ఆరోపించారు. చాలీచాలని వేతనాలలు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. ఏండ్ల తరబడి సేవలందిస్తున్న వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని.. గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పది లక్షల సాధారణ బీమా, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. సెర్ప్ నుండి ఐడి కార్డులను వెంటనే మంజూరు చేయాలన్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాలు వివోఏల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలన్నారు. అర్హత కలిగిన వివోఏలందరినీ సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం చేసే వరకు సమ్మె నిర్వహిస్తామన్నారు. కొండాపూర్‌లో సీఐటీయూ ఐకెపి వివోఎలా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు అనిత, సీఐటీయూ మండల కన్వీనర్ బాబురావు, వివోఏల మండల ప్రధాన కార్యదర్శి శీను, మండల అధ్యక్షులు సంజీవులు, సహాయ కార్యదర్శి ప్రవీణ్, మధుకర్, రమేష్, లక్ష్మి, అశ్విని, సంగీత, మాధవి, అన్నపూర్ణ, రజిత, సదాశివపేటలో ఐకెపి వీవోఏల యూనియన్ నాయకులు సుధాకర్ నాగరాజ్, ఆంజనేయులు, మల్లేశం మంగ, సుధాకర్, సత్యమ్మ జ్యోతి, విశాల, జోగిపేటలో సీఐటీయూ జిల్లా కోశాధికారి మల్లన్న, ఆంజనేయులు, లక్ష్మా రెడ్డి, శ్రీరామ్, నాయకులు విజయ,కవిత, సునీత, స్వప్న, సువర్ణ, గోపాల్, అశోక్, లాయక్ బాలయ్య, పోచయ్య, సంజీవులు, హర్ష లక్ష్మి, వీరమని, సుప్రియ, అఫ్సర్, రేణుక, అనిత, భాగయ్య, ఫహీం, వాసవి, మునిపల్లిలో మండల ఉపాధ్యక్షులు మల్లేశం, కోశాధికారి వినోద, సభ్యులు శివ కుమార్, లింగం గౌడ్, శ్రీశైలం, అనిత, సంగీత, రాణి, దినకర్, శేఖర్, శ్రీశైలం, సంతోష్, రాచన్న, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-పటాన్‌చెరు

మైనార్టీల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ముస్లింలకు పరమ పవిత్రమైనది రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం రాత్రి మండలంలోని చిట్కుల్ గ్రామంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గ్రామంలోని మసీదు వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులకు వడ్డించడంతో పాటు వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ముస్లీం సోదరులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కేసిఆర్ మైనారీటిల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. మహెూన్నతమైన వ్యక్తికి మనమందరం అండగా ఉండాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎండి



కాజామీయా, అబ్దుల్ రఫీక్, అబ్దుల్ జబ్బర్, యూసుఫ్, ఎండి సిరాజ్, షేక్ రజాక్, అష్రాఫ్, మహమూద్, రియాజ్, నరసింహ గౌడ్, వార్డు సభ్యులు మురళీ, వెంకటేశ్, రాజ్ కుమార్,మాజీ నీటి సంఘం చైర్మన్. సిహెచ్ వెంకటేష్, శ్రీను, ముస్లిం సోదరులు ఎంఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
మంగళవారం 18 ఏప్రిల్ 2023


ధర్మారం భూములపై సమగ్ర విచారణ జరపాలి

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని నత్నాయి పల్లి గ్రామ సమీపంలో ఉన్న 630 ఎకరాల భూములపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ సోమవారం నర్సాపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయులుకు నత్నాయి పల్లి గ్రామస్తులతో కలిసి. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ ఈ భూములను కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మదన్ రెడ్డి కలుగజేసుకొని ఈ భూములపై అధికారుల చేత విచారణ జరిపించాలన్నారు. ప్రస్తుతం కబ్జాలో ఉన్న నత్నాయపల్లి గ్రామానికి చెందిన రైతులకు పట్టా సర్టిఫికెట్లు ఇప్పించాలని ఆయన కోరారు. లేకుంటే నత్తయపల్లి గ్రామ రైతులకు న్యాయం జరిగేంత వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉదయ్, రైతులు పాల్గొన్నారు.



సంఖాపుర్‌లో సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన



నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి మండల వైస్ ఎంపిపి సుజాత శంకర్ ఆధ్వర్యంలో సోమవారం శంఖాపూర్ గ్రామం, శంఖాపూర్ తాండాలో సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను చేపట్టారు. శంఖాపూర్ అంగన్వాడి సెంటర్ నెంబర్ 1 లో ముగ్గురికి, 2వ సెంటర్‌లో ఇద్దరికీ, గ్రామ తాండాలో ఇద్దరి చొప్పున శ్రీమంతాలు, అలాగే నలుగురు పిల్లలకు అన్న ప్రాసన చేశారు. ఈ సందర్భంగా సుజాత శంకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తల్లీ బిడ్డల సంక్షేమానికి ఏ ప్రభుత్వం చేయనంత కృషి చేస్తున్నదన్నారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణీలకు, చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తున్నదన్నారు. అలాగే కేసీఆర్ కిట్ లాంటి అనేక విధాలుగా సహాయ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూలక్ష్మి, ఉప సర్పంచ్ లాల్ సింగ్, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోలీస్ హెడ్ క్వార్టర్‌లో కంటి వెలుగు



నవ తెలంగాణ మెదక్ టౌన్

మెదక్ జిల్లా పోలీస్ హెడ్ క్వాటర్‌లో సోమవారం జిల్లా ఎస్పి రోహిణి ప్రియదర్శిని కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు నిర్వహించుకుని, కంటి పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ కార్యాలయ ఏఆర్, సిబ్బంది, జిల్లా సిబ్బంది అందరికీ కంటి పరీక్షలు జరిపి అద్దాలను అందించడం జరుగుతుందన్నారు. అందరికీ కంటి పరీక్షలు పూర్తి అయ్యే వరకు ఈ వైద్య శిబిరాన్ని కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా ఏఆర్ హెడ్ క్వార్టర్ డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది ఏఆర్ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు సిబ్బంది కంటి పరీక్షలు పూర్తయ్యేంత వరకు ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డాక్టర్ ఎన్ నవీన్ కుమార్, డాక్టర్ స్నేహ, నేత్ర వైద్యులు రాజయ్య, నేత్ర వైద్యులు శ్యామ్ రావు, ఏఆర్డిఎస్పి శ్రీనివాస్, ఆర్ఐ అచ్యుత రావు, ఆర్ఐ నాగేశ్వర్ రావు, మెదక్ రూరల్ సిఐ విజయ్, ఆర్ఎస్ఐలు భవానీ కుమార్, నరేశ్, మహిపాల్, కంటి వెలుగు సిబ్బంది మంజుల, సవిత, స్వరూప, వాణి, సుధారాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం మండల యువత అధ్యక్షుడిగా రాజేందర్



నవతెలంగాణ-కొల్చారం

ముదిరాజ్ సంఘం మండల యువత అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంగారి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. ఇందులో భాగంగా మండల యువత అధ్యక్షునిగా కోనాపూర్ గ్రామానికి చెందిన బండి రాజేందర్, ఉపాధ్యక్షునిగా రమేష్ (అంసానిపల్లి), మధు, ప్రధాన కార్యదర్శి సుధాకర్ (రంగంపేట్), కోశాధికారి యాదగిరి (అప్పాజీపల్లి), సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహేష్ (వెంకటాపూర్), కార్యదర్శులుగా నర్సింలు, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీహరి, అభిలాష్, సుధాకర్, సతీష్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘం నాయకులు బండి రమేష్, మోత్కు మల్లేశం, చంటయ్య, నర్సింలు చలం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల కులస్తులను ఆదుకోవాలి



నవతెలంగాణ-మెదక్ రూరల్

ఎరుకల కులస్తులను ఆదుకో వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు షీలా సారం బిక్షపతి కోరారు. ఎరుకల నాంచారమ్మ, బోనాల జాతర, యాదాద్రి భువనగిరి ఘనంగా జరుగుతుందన్నారు. ఎరుకల ఆరాధ్య దైవమైన నాంచారమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం బాసటగా నిలిచిందన్నారు. సోమవారం మెదక్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షిషా సమక్షంలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు ఉత్సవానికి ప్రతి ఒక్కరు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, సత్తయ్య, పెంటయ్య, రాజు, బిక్షపతి, మల్లేశం, గిరి తదితరులు పాల్గొన్నారు

నార్లాపూర్‌లో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు అవగాహన



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో ఫైలేరియా వ్యాధి ఉన్న వారికి గ్రామ సర్పంచ్ అమరసేనారెడ్డి ఆధ్వర్యంలో ధర్మారం పీఎస్‌సిఎస్ డాక్టర్ హరిప్రియ, ఫైలేరియా డాక్టర్ కుమారస్వామి 26 మంది బోధకాలు వ్యాధిగ్రస్తులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. దాంతోపాటు మెడిసిన్స్ పంపిణీ చేశారు. టబ్బు, జగ్గు సబ్బు తదితర సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-టేక్మాల్

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ప్రతి సంవత్సరం మాదిరిగానే సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీ జైపాల్, ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌లు రంజాన్ కానుకలను అందజేశారు. అందోలు లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్లో టేక్మాల్ మండలానికి చెందిన పలు గ్రామాల లబ్దిదారులకు రంజాన్ కానుకలు, కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్, చింత రవి, భాస్కర్, సిద్దయ్య, సర్పంచులు నారాయణ, శీను, యాదయ్య, శ్రీశైలం, రాజేష్ గౌడ్, ఈశ్వరప్ప, షాపూర్దీన్, కిషన్, మల్లేశం, డైరెక్టర్ యాదయ్య, దుర్గయ్య, ఏలకుర్తి మణయ్య తదితరులు పాల్గొన్నారు

సంస్కార్ విద్యాలయ వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తృటిలో తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట

పెద్ద శంకరంపేట మండల పరిధిలోని చీలపల్లి క్రాస్ రోడ్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసి బస్సు మూలమలుపు వద్ద సంస్కార్ విద్యాలయ పాఠశాలకు చెందిన వ్యాన్‌ను సోమవారం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరేపల్లికి చెందిన విద్యార్థి కృష్ణమోహన్‌కు స్వల్ప గాయాలయ్యాయి, వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు. దాదాపు వ్యాన్‌లో పదిమంది విద్యార్థులు ప్రయాణిస్తున్న సమయంలో బస్సు ఎదురుగా ఢీకొట్టడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పిందని పలువురు పేర్కొన్నారు. చీలపల్లి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు పాఠశాల ముందు భాగాన్ని ఢీకొట్టిందని పాఠశాల యాజమాన్యం బాధ్యులు తెలిపారు. కాగా విద్యార్థి బంధువులు పాఠశాల యాజమాన్యం పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పెద్ద చింతకుంట గ్రామ సర్పంచ్‌కు పితృవియోగం

పరామర్శించిన ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామ సర్పంచ్ గుండె శివకుమార్ తండ్రి గుండె నరసయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పెద్ద చింతకుంట గ్రామానికి వెళ్లి సర్పంచ్ శివకుమార్‌ను ఓదార్చి ఆయనకు మనోధైర్యం కల్పించారు. ప్రగాఢ సంతాపం తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట నర్సింగ్ రావు, గ్రామస్తులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు స్క్రాబ్ దుకాణంలో చెలరేగిన మంటలు

దట్టమైన పొగ మంటలు

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ప్రమాదవశాత్తు స్క్రాబ్ దుకాణంలో మంటలు చెలరేగాయి. దాంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో పాటు నల్లటి పొగ పెద్దఎత్తున రావడంతో చుట్టు పక్కన ఉన్న ప్రజలు భయాందోళణకు గురయ్యారు. వెంటనే ఫైర్ స్టేషన్‌కు



సమాచారం ఇవ్వడంతో నర్సాపూర్ నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటన సోమవారం తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం వివరాలు ఇలా ఉన్నాయి. అంజనేయులు గత కొన్ని సంవత్సరాలుగా స్థానికంగా స్క్రాబ్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగా సోమవారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. దాంతో ఒక్క సారిగా మంటలు చెలరేగడంతో పాటు పెద్దఎత్తున నల్లటి పొగ వ్యాపించింది. దాంతో దుకాణం చుట్టు ప్రక్కన ఉన్న ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే మున్సిపల్ కమీషనర్ మోహన్ మున్సిపల్ సిబ్బందితో ట్యాంకర్ల ద్వార నీటిని తరలించి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి, మంటలు అదుపులోకి రాలేదు. వెంటనే నర్సాపూర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి

వేసవి కాలం కావడంతో ఎక్కడో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం



ఉందని ఒక వేళ అలా జరిగితే మంటలను ఆర్పే ఫైర్ స్టేషన్ ఇక్కడ అందుబాటులో లేక పోవడంతో ఇలాంటి ప్రమాదాల్లో అగ్నికి ఆహుతి అవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా మనోహరాబాద్ మండలంలో వందల సంఖ్యలో పరిశ్రమలు ఉండగా, తూప్రాన్ మున్సిపల్ కావడం, రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గం అయినప్పటికి ఇక్కడ ఫైర్ స్టేషన్ లేకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ఐకేపిలో వీవోఏలుగా పనిచేస్తున్న వారిని వెంటనే ప్రభుత్వం గుర్తించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి వారికి ఉద్యోగ భద్రతను కల్పించాలని ఐకేపి వీవోఏలు డిమాండ్ చేశారు. వీవోఏలు హక్కుల సాధన కోసం చేపట్టిన సమ్మెను కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌లో కూర్చుని సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ తాము ఐకేపి ద్వార చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించి వెంటనే తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలిపారు. అందరి ఉద్యోగులలాగే తమకు కూడా రూ.20 లక్షల సాధారణ బీమాతో పాటు ఆరోగ్య బీమాను కల్పించాలని, సెర్ప్ నుండి ఐడీ కార్డులను ఇవ్వాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలను వీవోఏల వ్యక్తిగత ఖాతాలలో వేయాలని కోరారు. వీవోఏలతో ఆన్‌లైన్ పనులను చేయించకూడదని, వీవోఏలపైన మహిళా సంఘాల వత్తిడి ఎక్కువగా ఉన్నందున ఎస్‌హెచ్‌జీలకు వీఎల్ఆర్ అభయహస్తం ద్వార డబ్బులు చెల్లించాలన్నారు.



ఎస్‌హెచ్‌జి వీఏ లైవ్ మీటింగ్‌లను రద్దు చేయాలని, అర్హులైన వీవోఏలకు సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి అనురాధ, కోషాదికారి దీప, ఉపాధ్యక్షురాలు, సహాయ కార్యదర్శి నవనీత, కల్పన, అమృత, అనసూయ, లక్ష్మి, హేమలత, సునంద, వీణి, సంధ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని రిలే నిరాహార దీక్షలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, అంబేద్కర్ భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు మండల అధ్యక్షులు బండారి చంద్రయ్య ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజైన సోమవారం నాడు కూడా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో మలమహానాడు జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు సంజీవ్, రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంపేట మండల కేంద్రంలో మాల కుల సంఘానికి కమ్యూనిటీ హాల్ కట్టించాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎంపీకి విన్నవించుకున్నా పట్టించుకున్న పాపన పోలేదన్నారు. అన్ని కుల సంఘాలకు ప్రొసిడింగ్‌లు ఇచ్చారని, మాల కులస్తులు ఏం పాపం చేశారని ప్రొసీడింగులు ఇవ్వడం లేదన్నారు. మాల కమ్యూనిటీ హాల్‌కు రూ.30 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా "చిలకలమ్మ గుడి నుండి నస్కల్ రోడ్డువరకు' సిసి రోడ్డు వేసి డ్రైనేజీలు కట్టించాలని, దళిత బహుజనలకు సభలు సమావేశాలు నిర్వహించుకునేందుకు రూ.50 లక్షలతో అంబేద్కర్ భవనం నిర్మించాలన్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించే వరకు ఈ రిలే దీక్షలు కొనసాగిస్తామన్నారు. అనంతరం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మాల మహానాడు సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి హాజరై వారికి సంఘీభావాన్ని తెలిపారు. కమ్యూనిటీ హాళ్ల కోరడంలో తప్పు లేదని, వారి న్యాయమైన కోరికలను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ ర్యకం శ్రీరాములు, మాల మహానాడు గౌరవ అధ్యక్షులు రాజయ్య, మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి ఇసక్, మెదక్ టౌన్ ప్రెసిడెంట్ ప్రసాద్, జగన్, కోటేష్, కాంగ్రెస్ నాయకులు లింగం గౌడ్, పంజా మహేందర్, మధుసూదన్ రెడ్డి, చింతల స్వామి, మోహన్ రెడ్డి, సిరుద్దీన్, రజాక్ పల్లి చిన్న నారా గౌడ్, కాకి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవ తెలంగాణ-నర్సాపూర్

పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి కోరారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకుగాను ఈ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రంజాన్ పండుగను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇఫ్తార్ విందుకు ముస్లిం సోదరులు హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మదన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా కోఆప్షన్ మెంబర్ మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ గౌరై వెంకట్ రెడ్డి, జెడ్పీటీసీ బాబ్యానాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భోగ శేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, వైస్ ఎంపీపీ వెంకట నర్సింగ్ రావు, నాయకులు అంజనేయులు గౌడ్, శివకుమార్, తదితరులు ఉన్నారు.

మిషన్ కాకతీయ ద్వార చెరువుల పునరుద్ధరణ

జడ్‌పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చెరువులను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మిషన్ కాకతీయ పథకాన్ని తీసుకువచ్చారని, దాంతోనే రాష్ట్రంలోని చెరువులు అభివృద్ధి చెందాయని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ దత్తత గ్రామం గౌతోజిగూడలో నాలుగవ విడతలో మంజూరైన రూ.17 లక్షలతో మంజూరైన కట్ట, అలుగు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన వల్లే చెరువులు పునరుద్ధరణకు నోచుకున్నాయన్నారు. గత పాలకులు కనీసం చెరువలను పట్టించుకున్న పాపాన పోకపోవడంతోనే చెరువులు నిండితే ఎప్పుడు బుంగలు పడతాయో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వార చెరువులకు నిధులను మంజూరు చేసి బాగుచేసినట్టు తెలిపారు. రాష్ట్రంలోని చెరువులు కుంటలు నీటితో కళకళలాడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ, ఎంపీడీవో యాదగిరిరెడ్డి, మండల వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డి, సర్పంచ్ బొడ్డు వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు పంచమి రేణుకుమార్, ఆత్మా కమిటీ డైరెక్టర్ బండారు భిక్షపతి, రంగాయిపల్లి సర్పంచ్ నాగభూషణం, కార్యదర్శి నందిని, ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్స్‌పెక్టర్ రాజు, వార్డు సభ్యులు పెంటమ్మ, భవాని, శ్రీనివాస్, అంజనేయులు, కాంట్రాక్టర్ రవితేజ, నాయకులు నర్సింలు, నారాయణ, కృష్ణ, సాయిలులతో పాటు అధిక సంఖ్యలో నాయకులు మహిళలు పాల్గొన్నారు.

రబీ బియ్యం డెలివరీ క్లియర్ చేయాలి



నవతెలంగాణ-మెదక్ రూరల్

రబీ 2021-22 బియ్యం పెండింగ్ డెలివరీ క్లియర్ చేసే విషయమై జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా రైస్ మిల్లర్ల సమస్యలను ప్రస్తావిస్తూ త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా సూచనలు చేశారు. జిల్లా నుంచి బియ్యం డెలివరీ చేసిన ఏసీకేలను త్వరితగతిన ఆన్‌లోడ్ పనులు పరిశీలన పూర్తి చేయాలని ఎఫ్‌సీఐ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా నుండి బియ్యం డెలివేరిలో ఎక్కువగా రిజెక్షన్ చేస్తున్నారు అని వాటిని రిజెక్షన్ చేయటం తగ్గిస్తూ మిల్లర్లకు సహాయం చేయాలని సూచించారు. జిల్లా మిల్లర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పెండింగ్ బియ్యాన్ని వెనువెంటనే పూర్తి చేయాలని మిల్లర్లకు ఆదేశాలు ఇచ్చారు. రబీ బియ్యం డెలివరీకి ఏప్రిల్ 30 తుది గడువు అని ఆలోగా లక్ష్యం పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. జిల్లాలో వచ్చే రబీ సీజన్ నందు ధాన్యం ఎక్కువ వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం నిల్వ చేయుటకు స్థలం లేనందున త్వరితగతిన బియ్యం డెలివరీ పూర్తి చేస్తేనే ధాన్యం నిల్వ చేయుటకు ఉపయోగంగా ఉంటుందని తెలియజేశారు. ఈ సమీక్షలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్, ఎఫ్‌సీఐ సనత్నగర్. డిఎం, జిల్లా రైస్ మిల్లర్ల అధ్యక్షుడు చంద్రపాల్ ఇతర మిల్లర్లు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై కళాబృందాలచే అవగాహన



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలో తడి, పొడి చెత్త వేర్వేరు చేయడంపై అలాగే హానికర వ్యర్థ పదార్థాలపై జిల్లా కళాబృందం వారిచే నర్సాపూర్ పట్టణంలో సోమవారం నుంచి కళా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. సోమవారం ఈ కళా ప్రదర్శనలను ఏ విధంగా నిర్వహించాలనే దానిపై మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక కళాశారది, సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కళాబృందం వారిచే నర్సాపూర్ పట్టణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాబృందం కళాకారులు తడి చెత్తను, పొడి చెత్తను, హానికరమైన వ్యర్థపదార్థాలను ఎలా వేరు చేయాలో పాటల ద్వారా ప్రజలకు వివరిస్తారన్నారు. ఇంటి వద్దకు వచ్చే ఆటోలలో తడి, పొడి చెత్తతో పాటు హానికర వ్యర్థ పదార్థాలపై కళా ప్రదర్శన ద్వారా ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి వార్డులో ఈ కళా ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం సిబ్బంది మెప్మా సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఊరకుక్కల దాడితో 25 గొర్రెల మృతి

బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలి : ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి యాదవ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ఊర కుక్కల దాడిలో గొర్రెలను కోల్పోయిన మల్లేశ్ యాదవ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి యాదవ్ కోరారు. సోమవారం మనోహరాబాద్‌కు చెందిన మల్లేష్‌యాదవ్‌కు చెందిన గొర్రెల మందపై ఊరకుక్కలు దాడి చేయగా, 40 గొర్రెలలో 25 గొర్రెలు మృతి చెందగా మరో 15 గొర్రెలు గాయాల పాలయ్యాయి. విషయం తెలుసుకున్న యాదవ సంఘం నాయకులు అఖిల భారత యాదవ మహ సభ అధ్యక్షులు గంది మల్లేష్‌యాదవ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మామిండ్ల ఐలయ్య యాదవ్, మాజీ సర్పంచ్‌తో కలిసి బాదిత కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థిక సహయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాదవులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి గొర్రెలను అందజేస్తుందన్నారు. గొర్రెల పెంపకంతో అభివృద్ధి చెందుతున్న మల్లేష్‌యాదవ్ గొర్రెల మందపై ఊరకుక్కలు దాడి చేయడంతో గొర్రెలు మృతి చెందాయని, దాంతో మల్లేష్‌యాదవ్ జీవనోపాదిని కోల్పోయాడన్నారు. వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సహయం అందే విధంగా సహకారం అందించనున్నట్టు ఆయన తెలిపారు. అలాగే గ్రామ సర్పంచ్ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి గ్రామ కార్యదర్శి రూపాగౌడ్‌తో కలిసి మల్లేష్‌యాదవ్ కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థిక సహయాన్ని అందజేశారు. వారిని ఆదుకునే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ రాజారాం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నరేష్‌గౌడ్, జహంగీర్‌యాదవ్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన అంతర్ముఖ యోగ శిక్షణ



నవతెలంగాణ-సంగారెడ్డి

సత్య సేవక్, ప్రేమారవింద బిక్షమయ్య గురూజీ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్లో ప్రశాంత్ నగర్ కాలనీ ఈ నెల16,17,న నిర్వహించిన అంతర్ముఖ యోగ శిక్షణ తరగతులు విజయవంతం అయ్యాయని తెలిపారు. యోగా శిక్షణ తరగతులకు పట్టణం, గ్రామీణ ప్రజలు సుమారు 150 మంది పైగా హాజరైనట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చండేశ్వరి, మధు, సంతోష్, రాజు, ఈశ్వరప్ప, నరసింహులు, కృష్ణ మూర్తి, చంద్రశేఖర్ రెడ్డి, రవి, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నవ తెలంగాణ-మెదక్ టౌన్ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని క్రిస్టల్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ముస్లిం ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో 40 రోజులు ఉపవాస దీక్షలు చేయడం గొప్ప సంకల్పమన్నారు. దేవుని దయతో జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ముస్లిం ప్రజలందరికి, సోదరి సోదరీమణులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మధ్య మత ద్వేషాలు, కులాల మధ్య చిచ్చు రేపుతున్న పాలకులకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని, ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో, దేశములో రాబోయేది కాంగ్రెస్ పార్టీ పాలనేనని ధీమా



వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు మామిళ్ల అంజనేయులు, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మైనార్టీ నాయకులు హఫీజ్ ఉద్దీన్, ఫాజిల్, జాహిద్ మౌలానా, హైమద్, ఫారూఖ్ హుస్సేన్, మన్సూర్, లల్లు, అమిరోద్దీన్, సలీం, ముజీబ్, కౌన్సిలర్ అవారి శేఖర్, మహేందర్ రెడ్డి, సిరిమల్లె శ్రీనివాస్, రాంచందర్ గౌడ్, మోహన్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, చందు పాల్గొన్నారు.

మల్లంపల్లిలో సీసీ రోడ్డును పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామంలో ఎన్ఆర్‌ఈజీఎస్ కింద నిర్మించిన సిసి రోడ్ ను సోమవారం పంచాయతీ రాజ్ డిఈఈ సదాశివరెడ్డి, ఏఈ స్నేహ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి రోడ్ ను పరిశీలించామని, నిర్మాణంలో ఏదైనా అవకతవకలు జరిగినట్లయితే కాంట్రాక్టర్ పై చర్యలు ఉంటాయని అన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు.



ఇంటర్ స్టేట్ ఒలంపియాడ్‌లో విశ్వ శాంతి విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-వర్గల్



ఈ-అభ్యస్ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి గ్లోబల్ ఒలంపియాడ్ ఐఐటి పోటీ పరీక్షలో వర్గల్ మండలం, నెంటూర్ గ్రామంలోని విశ్వశాంతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు 25 అవార్డులను సాధించారు. మొదటి బహుమతి 10 మంది, రెండో బహుమతి 9 మంది, మూడో బహుమతి 6 మంది మొత్తం 25 మంది విద్యార్థులు అవార్డులను సాధించారు. రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డా.వరప్రసాద్ రెడ్డి, జయప్రకాష్ నారాయణ, డా.ఫణి కుమార్, చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కస్పాండెంట్ దయాకర్, ప్రిన్సిపాల్ దేవి మాట్లాడుతూ. ఈ అవార్డులను అందుకోవడం తమకెంతో గర్వకారణమన్నారు. విద్యార్థుల ఉన్నతికై సహకరించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక సంఖ్యలో పద్మశాలి సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-దుబ్బాక



త్వరలో జరగబోవు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికల సందర్భంగా అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు దుబ్బాక పద్మశాలి సమాజం అధ్యక్షుడు గాజుల తిరుపతి తెలిపారు. సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు బూర మల్లేశం, ఎంఆర్‌ఓ మల్లేశం, బిక్షపతిల సమక్షంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పద్మశాలి కులస్తులు తమ సభ్యత్వాన్ని నమోదు చేయించుకోవాలని కోరారు. ఉపాధ్యక్షుడు డి.రవీందర్, పద్మశాలి సమాజం సభ్యులు ఉన్నారు.

నిలువ నీడ లేదాయె

- దినం గడిస్తే పూట గడవదాయె

నవతెలంగాణ-గజ్వేల్

నిలువ నీడ లేదు. దినం గడిస్తే పూట గడవదాయె.. ఎండైనా.. వానైనా.. చలి కాలమైనా బతుకుదెరువు కోసం ఈ రోడ్డుపైనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. రోడ్డు మీది రాకపోతే.. నోటి కాడికి బుక్కరాదు. ఇది గజ్వేల్ చిరు వ్యాపారుల జీవన పరిస్థితి.

గజ్వేల్ పట్టణంలో చిన్నచిన్న గుడారాలు, డబ్బాలలో చిరు వ్యాపారం చేసుకున్న వారంతా సమీకృత మార్కెట్ నిర్మాణం జరిగిన తర్వాతగా ఫుట్‌పాత్ బతుకుగా మారింది. పట్టణంలోని సమీకృత మార్కెట్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ లేకపోవడంతో చిరువ్యాపారులు అవస్థలు పడుతున్నారు. గతంలో డిగ్రీ కళాశాల, బస్టాండు చుట్టూ డబ్బాలు వేసుకొని వ్యాపారాలు చేసుకొని కుటుంబాలను పోషించుకునేవారు. ఇప్పుడు మడిగెలు కరువై... డబ్బాలు వేసుకునేందుకు వీల్లేక రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌పై సామగ్రి అమ్ముకుంటున్నారు. గతంలో రోజుకు రూ.5 వేల వరకు లావాదేవీలు సాగిస్తూ సంతోషంగా బతికామని, ఇప్పుడు రూ.వెయ్యి రావడం గగనమైందని ఆవేదన చెందుతున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని గతంలో మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి చిరు వ్యాపారులకు హామీ ఇచ్చారు. పని పూర్తి చేసిన తర్వాత కలెక్టర్ చేతులెత్తేశారు. ఇప్పుడు చిరు వ్యాపారులు గోసపడుతున్నారు. నిత్యావసర సరకులు, కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం, చేపలన్నీ ఒకేచోట లభిస్తే కొను గోలుదారులకు సౌకర్యంగా ఉండటంతో పాటు ట్రాఫిక్ సమస్యను అరికట్టాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రూ.2.85 కోట్లతో 6.24 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత మార్కెట్ నిర్మించారు. 2019 డిసెంబరు నుంచి అందుబాటులోకి తీసుకొ చ్చారు. మార్కెట్లో 16 దుకాణ సముదాయాలు, 1 సూపర్ మార్కెట్ తో పాటు 200 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఇందులో 52 స్టాళ్లు మాంసం విక్రేతలకు, 45 పూలు, పండ్ల వ్యాపారులకు, మిగతా కూరగా యల వ్యాపారులకు కేటాయించారు.

ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు

ప్రభుత్వం నిర్మించిన సమీకృత మార్కెట్ సౌకర్యాల పరంగా బాగానే ఉన్న దాని చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ లేకపోవడంతో చిరు వ్యాపారులు గోస పడుతున్నారు. మార్కెట్ నిర్మించక ముందు ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొనసాగేది. దానికి మూడువైపులా వందలాది చిరు వ్యాపారులు డబ్బాలు వేసుకొని గాజులు, చెప్పులు, దుస్తులు, ఇంటి సామగ్రి, ఇనుప వస్తువులు అమ్ముకున్నారు. పువ్వులు, పండ్లు ఇతర సామగ్రి విక్రయిస్తూ జీవించేవారు. వేలాది కుటుంబాలకు ఆసరాగా ఉండేది. మార్కెట్ నిర్మాణం తర్వాత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెకిస్తామన్నారు. తరవాత ఆ విషయం మరుగునపడిపోయింది. మార్కెట్ నిర్మాణం సందర్భంగా కూల్చివేసిన ఆర్టీసీ బస్టాండు దగ్గరి షాపింగ్ కాంప్లెక్స్ వారికి సంగా పూర్ రోడ్డులోని దుకాణ సముదాయంలో కేటాయించారు. చిరు వ్యాపారులకు మాత్రం ఇటు డబ్బాలు వేసుకునే అవకాశం లేక, మడిగెలు దొరక్క రోడ్డు పక్కన ప్లాట్ఫారాలపై వ్యాపారాలు సాగిస్తున్నారు. పట్టణం మధ్యలో మార్కెట్ ఉండటంతో ఇక్కడ అద్దె డిమాండ్ ఎక్కువ. ప్రైవేటు వ్యక్తుల మడిగెలకు నెలకు గరిష్ఠంగా రూ.60 వేలు అద్దె చెల్లిస్తున్నారు. వ్యాపారులు అంత మొత్తం చెల్లించ లేక తోపుడు బండ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం సమీకృత మార్కెట్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే చిరు వ్యాపారులకు చేయూత ఇచ్చినట్లవుతుందని, ఆదాయం వస్తుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ గత నాలుగు సంవత్సరాలుగా చేయని ప్రయత్నాలు లేవు. మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.



ఎండకు ఎండుతున్నం



ఎండకు ఎండుతున్నం. వానకు తడుస్తూ, చలికి చచ్చిపోతున్నాను. ఏ కాలమైనా బతుకు కోసం రోడ్డుమీద రావాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిరు వ్యాపారులకు దుకాణ సముదాయం నిర్మించండి. మంత్రి హరీష్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ స్పందించి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి.

– చిరు వ్యాపారి వెంకటేశం

నోట్లోకి బుక్క రాదు



ఒకరోజు రోడ్డుమీకి రాకపోతే నోట్లో కి బుక్క రాదు. సర్కారు గుర్తించాలి. ఏ కాలమైనా మా బతుకుతెరువు రోడ్డుపైనే. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వండి. మార్కెట్లో ధరలు మండిపోతున్నాయి. ఒక గది అద్దె తీసుకోవాలంటే రూ.60 వేలు చెల్లించాలి. ప్రభుత్వం స్పందించి చిరు వ్యాపారుల కోసం గదులు నిర్మించాలి.

– చిరు వ్యాపారి శ్రీనివాస్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని దుంపలపల్లి వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఎంపి సమక్షంలో 4వ వార్డు కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకట నరసింహారెడ్డి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఖర్చులు లేకుండా ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన కళ్లద్దాలు, మందులను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. దుంపలపల్లి వార్డు ప్రజలందరూ కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురికి ఎంపీ ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ వనిత భూమిరెడ్డి, వైస్ చైర్ పర్సన్ సుగుణ బాలకిషన్ గౌడ్, కమిషనర్ గణేష్ రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్ వెంకట స్వామి గౌడ్, బీఆర్ఎస్ నాయకులు హర్ష వర్ధర్ పందు,పలువురు ఉన్నారు.

నియోజకవర్గ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడి నియామకం



నవతెలంగాణ-బెజ్జంకి

మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నూతన యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా మ్యాకల నాగరాజు నియామకమయ్యారు. మండల పరిధిలోని దాచారం గ్రామానికి చెందిన మ్యాకల నాగరాజుకు సోమవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నాగారాజుకు నియామకపత్రం అందజేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



నవతెలంగాణ-ములుగు

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132 వ జయంతి సందర్భంగా ములుగు మండలం శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము నవీన్ కుమార్ దళితులకు చేసిన సేవకుగాను దళిత రత్న అవార్డు రావడంతో సోమవారం ములుగులో ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి , వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ ములుగు మండల ఫాక్స్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షులు జుబేర్ పాషాతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో దళితులకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కొమ్ము నవీన్ కుమార్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డును అందజేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు, మంత్రి కొప్పుల ఈశ్వర్‌లకు కృతజ్ఞతలు తెలిపానేజ వారిచ్చిన స్ఫూర్తితో ఇంకా మంచి కార్యక్రమాలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ హరిబాబు, వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ కనకేష్, ఆసిఫ్ జహంగీర్, సుదర్శన్, ఎందల చంద్రశేఖర్, రాజు ,మహిపాల్ తదితరులు పాల్గొన్నారు


వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు



నవతెలంగాణ-సిద్దిపేట

మురంశెట్టి కవిత-కుమార్ వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారి సహకారంతో పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించామని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి తెలిపారు. చకిలం వంశీ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో అభయ జ్యోతి మానసిక వికలాంగుల విద్యాలయంలో అన్నదానం, మురంశెట్టి ముత్యం జ్ఞాపకార్థం వారి మనుమడు మురంశెట్టి మణిదీప్ సహకారంతో పాత బస్టాండు ఆవరణలో ప్రయాణికులకు వాటర్ మిలన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్ అధ్యక్షులు చింత రాజేంద్రప్రసాద్, తొడుపునూరి కృష్ణవేణి, అరవపల్లి హరికిరణ్, కార్యదర్శి చకిలం రవి, కోశాధికారి తిమిశెట్టి విజయలక్ష్మి, పీఆర్వో అయిత శంకర్, మంకాల సంతోష్, మురంశెట్టి శివకుమార్, మురంశెట్టి మణిదీప్, శివాని, రవి, పాల్గొన్నారు.

ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అశోక్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్‌లో బీ ఆ ర్ ఎ స్ మండల పార్టీ అధ్యక్షుడు బెండే మధు ఆధ్వర్యంలో ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన కొడకండ్ల ఎంపీటీసీ అరిగే అశోక్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ , బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి పండరి రవీందర్రావు, సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డిలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎంపీటీసీల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో ఎంపీటీసీల పాత్ర అమోఘమన్నారు.. ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఎంపీటీసీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తూనే వారికి అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తున్న విషయాన్ని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల పార్టీ అధ్యక్షుడు కొడిత్యాల భాస్కర్, మాజీ ఎంపీపీ చిన్న మల్లయ్య, ఎంపీటీసీ గోడుకు స్వామి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాటికొండ మధుసూదన్ రెడ్డి, భీమప్ప, చేలి రెడ్డి రాంరెడ్డి, పాల రమేష్ గౌడ్, బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, నరేష్, శ్రీను, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడిఈ పండరీ తెలిపారు. మంగళవారం ఉదయం 9-30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పటేల్‌పురా, ఎటి నగర్, సంజీవయ్య నగర్, నజీద్‌పురా, శంకర్ నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయగల్లి, నజీద్‌పురాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

మతోన్మాద కార్పొరేట్ బీజేపీని గద్దె దించండి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేష్
- 18న మద్దూరుకు సీపీఐ ప్రజా చైతన్య యాత్ర
- బస్సుయాత్ర జయప్రదం కోసం సీపీఐ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-మద్దూరు



మతోన్మాద కార్పొరేట్ అనుకూల బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించి దేశాన్ని రక్షించుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేష్ అన్నారు. ఈనెల 18న మద్దూరు మండలానికి రానున్న సీపీఐ ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సోమవారం సలాఖ్ పూర్, రేబర్తి, గాగిల్లాపూర్ గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేష్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్నా రాష్ట్ర విభజన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందని ఆయన విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను నెలకొల్పకుండా తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు దారాదత్తం చేసి అప్పనంగా అమ్మేస్తుందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ వంట, గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డీ విరుస్తుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన రైతు రుణమాఫీ, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, అర్హులైన పేదలందరికీ పెన్షన్లు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగడుతూ ఇంటింటికి సీపీఐ పల్లె పల్లెకు సీపీఐ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే ఈ నెల 18న మద్దూరు మండల కేంద్రానికి ప్రజా చైతన్య బస్సు యాత్ర వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, సిపిఐ మండల నాయకులు ఉడుగుల శ్రీనివాస్, సకినాల బాలరాజ్, ఇమ్మడి కిష్టయ్య, బియ్య రాజు, గోరుకంటి కుమార్, చెట్కూరి యాదయ్య, దయ్యాల కనకయ్య, మర్మముల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలుస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

- మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

నవతెలంగాణ-తొగుట



అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తూ మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి కొండంత భరోసా ఇస్తున్నారని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెంకట్రావు పేట గ్రామానికి చెందిన లబ్దిదారులకు మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లక్ష్మీనర్సవ్వకు రూ. 16 వేలు, బెజ్జనమైన రాధకు రూ.11 వేల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్యంకు పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడంతో పాటు, సూపర్ స్పెషాలిటీ సేవలు అందేలా కృషి చేస్తున్నారన్నారు. మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం ఆరోగ్య సేవలో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు అందించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ సేవలు పొందిన వారికి సైతం సీఎం సహాయనిది ద్వారా ఎల్‌ఓసి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిటిసీల ఫోరం అధ్యక్షులు కంకణాల నరసింహులు, సర్పంచ్ పాత్కుల లీలాదేవి వెంకటేశం, ఆత్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సుతారి రాములు, ఈదుగల్ల పర్శరాములు, నాయకులు పాత్కుల బాలేష్, బెజ్జనమైన ఎల్లం, శివకోటి తదితరులు ఉన్నారు.

సిద్దిపేటలో పర్యటించిన శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట మున్సిపాలిటీలో భువన్ సాంకేతికతపై పరిశీలించేందుకు సోమవారం శాస్త్రవేత్తలు పర్యటించారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ వారి స్పేస్ అప్లికేషన్ సెంటర్ (అహ్మదాబాద్) వారు అభివృద్ధి చేసిన భువన్ సాంకేతికత అప్లికేషన్ యొక్క సామాజిక పరిపాలన అనువర్తనాలు, వాటి ఉపయోగాలపై, ఇంకా మెరుగుపరచవలసిన అవశ్యకతల గురించి క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది సలహాలు, సూచనలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపునులను ఘనంగా సన్మానించారు. అనంతరం సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నారాయణ్ మహంతి, డాక్టర్ దీప్ చంద్ర, గోపిక, సిద్దిపేట మున్సిపల్ అడిషనల్ కమిషనర్ మల్లికార్జున్, గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, సిద్దిపేట మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ శ్రీకాంత్, యు.డి.అర్.ఐ బాలకృష్ణ, దుబ్బాక, గజ్వేల్ మున్సిపల్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- సమగ్రంగా సర్వే నిర్వహించాలి

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అర్హులందరికి డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని, 120 గజాల స్థలం ఇవ్వాలని డబుల్ బెడ్ రూమ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డబల్ బెడ్ రూమ్ సాధన కమిటీ కన్వీనర్ ఎల్లయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఐదు వేల మందికి ఇల్లు ఇస్తామని తెలిపి పట్టణంలో సమగ్రంగా సర్వే నిర్వహించకుండా1100 మందిని మాత్రమే ఎంపిక చేసిందన్నారు. వాటిలో కూడా సొంత ఆస్తులు భవనాలు ఉన్న వారికి మాత్రమే ఇవ్వడం జరిగిందని పేదలందరిని మోసం చేస్తుందన్నారు. పెద్ద మున్సిపల్ పట్టణమైన గజ్వేల్‌లో కనీసం 2500 మంది కుటుంబాలకు డబల్ బెడ్ రూమ్, 120 గజాల స్థలం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అవసరాల కోసం వందలాది ఎకరాల భూమి సేకరిస్తున్న ప్రభుత్వం పేదల నివాసానికి స్థలం లేదా అని ప్రశ్నించారు. డబల్ బెడ్ రూమ్ సాధించేవరకు పోరాటం చేస్తామని వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చిన వాటన్నిటి రద్దుచేసి మొదటి ప్రాధాన్యతగా మీకే ఇస్తామని తెలిపి తీరా ఇవ్వకుండా ఆనాడు నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేసి ప్రజలందరిని మోసం చేశారన్నారు. 20 సంవత్సరాలుకు పైగా అద్దె ఇళ్లలో ఉంటూ, పెరుగుతున్న ధరలతో జీవనం కొనసాగించలేక పేదల కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రజలందరికీ న్యాయం చేయాలని డబల్ బెడ్ రూమ్ ఇండ్లు 120 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని దానికి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింలు మల్లేశం, శ్రీనివాస్, కొండలు, కవితా పద్మ నాగమణి లక్ష్మి, యాదమ్మ , అరుణ ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాహిత్య సమ్మేళనానికి దేవులపల్లి రమేష్ ఎంపిక

నవతెలంగాణ-నంగునూరు



తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్.వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ సాహిత్య సంబరాలకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన దేవులపల్లి రమేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈ నెల 30న హైదరాబాద్‌లో తెలుగు వెలుగు సాహిత్య వేదిక ద్వారా విశేషంగా పలు అంశాలపై కవితలు రచించిన కవులకు అవార్డులు, ప్రశంస పత్రాలు సన్మానం చేయడం జరుగుతుందన్నారు. ఈ సాహిత్య సంబరాలకు దాదాపు 500 మందికిపైగా కవులు, రచయితలు, కళాకారులు పాల్గొంటారన్నారు. జాతీయ సాహిత్య సమ్మేళనానికి ఎంపిక కావడం చాలా సంతోషకరమన్నారు. జాతీయ సాహిత్య సమ్మేళనంలో 'నా తెలంగాణ సంస్కృతి' అంశంపై కవిత గానం వినిపించబోతున్నానని కవి దేవులపల్లి రమేశ్ పేర్కొన్నారు. మంచి అవకాశం వచ్చినందుకు చాలా సంతోషిస్తున్నానని తెలిపారు. తెలుగు భాష అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మహిళలు రాజకీయంగా రాణించాలి

నవతెలంగాణ-మర్కుక్



మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ, రాజకీయంగా ఎదగాలని ముదిరాజ్ మహాసభ మహిళ అధ్యక్షులు మందుల వరలక్ష్మి అన్నారు. ఆదివారం హైదరాబాదులో గల ఖైరాతబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్ లో ముదిరాజ్ మహా సభ మహిళ అధ్యక్షులు మందుల వరలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మర్కుక్ ముదిరాజ్ మహాసభ మహిళా మండలాధ్యక్షురాలు లింగ శ్రీలత హజరై మాట్లాడారు. ఈ మహిళా సదస్సుకు ముఖ్య అతిథిగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బండ ప్రకాష్ ముదిరాజ్ హజరై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ, తమ హక్కులను సాధించాలన్నారు. ఈ సందర్భంగా మర్కుక్ ముదిరాజ్ మహా సభ మహిళా మండలాధ్యక్షురాలు లింగ శ్రీలత బండ ప్రకాష్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల ముదిరాజ్ మహాసభ మహిళా అధ్యక్షురాలు నర్సంపల్లి లక్ష్మి, మహిళలు, తదితరులున్నారు.

పెట్రోల్ పంప్, షాపింగ్ కాంప్లెక్స్‌తో మరింత ఆదాయం



- డీడీఎఫ్

నవతెలంగాణ-దుబ్బాక

బస్సు డిపో ఎదురు గా "పెట్రోల్ పంపు", బస్టాండ్ ఆవరణలోగల ఖాళీ స్థలంలో కొత్తగా "షాపింగ్ కాంప్లెక్స్" నిర్మాణాన్ని చేపడితే దుబ్బాక బస్సు డిపోకు మరింత ఆదాయం వస్తుందని దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం (డీడీఎఫ్) అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ చెప్పారు. ఆదాయం వచ్చే అవకాశాలున్నా ఆర్టీసీ అధికారులు వాటిపై దృష్టి సారించక పోవడం బాధాకరమన్నారు. బస్సు డిపోకు ఆదాయం చేకూర్చే అంశాలను వివరిస్తూ సోమవారం డిడిఎఫ్ ఆధ్వర్యంలో దుబ్బాక బస్సు డిపో ఇన్చార్జి మల్లయ్య గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ,దుబ్బాక-హన్మకొండ బస్సును సిద్దిపేట నుంచి కాకుండా దుబ్బాక నుంచే నడపాలన్నారు. ఇక్కడి ప్రాంత వాసుల సౌకర్యార్థం వేములవాడ, బాసర, శ్రీశైలం, యాదగిరి గుట్ట వంటి పుణ్యక్షేత్రాలకు బస్సులు నడపాలని కోరారు. డీడీఎఫ్ సభ్యులు మర్గల రాజేష్, మాడబోయిన యాదగిరి ఉన్నారు.



జేపీఎస్‌లను పర్మనెంట్ చేయాలని నిరసన

నవతెలంగాణ-ఝరాసంగం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం ఎంపిడిఓ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము విధుల్లోకి చేరి నాలుగేండ్లు పూర్తయి నప్పటికీ నేటికీ పర్మనెంట్ చేయకపోవడాన్ని నిరసిస్తూ.. ఈనెల 17 నుండి 21 తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతామన్నారు. ఒకవేళ అప్పటికి కూడా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోతే తదుపరి కార్యచరణను ప్రకటిస్తామన్నారు. నిరసన తెలిపిన వారిలో ఇందిరా, గీతాంజలి, సరిత, నవీన్, రవికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కామరతి బీరప్ప స్వామి జాతరకు రూ.50 వేల విరాళం

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని అన్నారంలో బీరప్ప స్వామి జాతరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ తన వంతు సాయంగా రూ.50 వేల విరాళాన్ని మండల ముదిరాజ్ సంఘ ం అధ్యక్షులు గ్యరాల మల్లేష్ తదితరుల చేతుల మీదుగా దేవాలయ కమిటీ చైర్మెన్ మల్లేష్ యాదవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆల య కమిటీ సభ్యులు మదన్నకు ఆ మల్లికార్జున స్వామి ఆశీర్వాదం ఉం డాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్ఎంఆర్ యు ువసేన నా యకులు దేవునిచెరువు నర్సింలు, తుడుం శ్రీనివాస్,కుర్మ సంఘం అధ్య క్షులు గుండ్ల నర్సింహా, దర్గా బిక్షపతి,సిహెచ్ రవి, పెద్ద కుర్మ నర్సింహా, ర్యాకల కుమార్, రాజు, ర్యాకల ప్రశాంత్, రాజయ్య, సాయికుమార్, అరవింద్, వీరేశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రిపోర్టర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రోషన్‌రెడ్డి, నరసింహారెడ్డి



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని మీర్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన నవతెలంగాణ కల్హేర్ రిపోర్టర్ ఎన్.ప్రవీణ్ జన్మదిన వేడుకలు ఆదివారం బాచేపల్లి బంజారా దాబా వద్ద జరిగాయి. ఈ వేడుకల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తన యులు బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు, ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మహా రెడ్డి రోషన్ రెడ్డి, కల్హేర్ జెడ్పీటీసీ నరసింహారెడ్డి పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు కూలి బీమయ్య, వార్డ్ మెంబర్లు రాజేశ్వర్ గౌడ్, కూలినాందేవ్, బీఆర్ ఎస్ నాయకులు అన్నారావు పంతులు, డాక్టర్ జనార్దన్, గంగారం, పరమేశ్వర్, భానుగౌడ్, సీమోన్, దావీదు, యోహాన్, అమ్మ పటేల్, హరికృష్ణ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఝరాసంగం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు కిషన్ అన్నారు. సోమవారం మండలంలోని బొజ్జ నాయక్‌తాండాలోనీ పంచాయతీ భవనంలో రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏండ్ల పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేసుకోవాలని, ప్రభుత్వం తలపెట్టిన ఈ అవకాశాన్ని గ్రామ ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రుక్కిరాయ్, పంచాయతీ కార్యదర్శి రమేష్, డాక్టర్ మధులత, ఆప్తమాలజిస్ట్ రమేష్ ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస పరీక్షలో నెగ్గిన మచ్చందర్ వర్గం

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలోని ఇప్పేపల్లి పీఏసీఎస్ సొసైటీ అధ్యక్ష పదవి కోసం హోతిబి గ్రామానికి చెందిన డైరెక్టర్ మచ్చెందర్ సమక్షంలో మెజారిటీ సభ్యులు మాజీ చైర్మెన్ కిషన్ పవర్ పై తిరుగుబాటు చేసిన విషయం తెలిసిందే. తిరుగుబాటు చేసిన మచ్చేందర్ వర్గానికి చెందిన మెజారిటీ సభ్యులు సోమవారం పిఎసిఎస్ కార్యాలయానికి హాజరై.. తమ బలపరీక్షలో నెగి అధ్యక్షుడిగా మచ్చేందర్‌ను ఎన్నుకున్నారు. దీంతో మచ్చేందర్ వర్గానికి చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పిఎసిఎస్ కార్యాలయం వద్దకు చేరుకొని నినాదాలు చేసి మచ్చేందర్‌తో పాటు తిరుగుబాటు చేసిన డైరెక్టర్ అందరికీ పూలమాలలు శాలువాలతో సన్మానించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జహీరాబాద్ పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.

దివ్యాంగుల పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలో గల దివ్యాంగులు ప్రభుత్వం అందజేస్తున్న దివ్యాంగుల సహాయ పరికరాలను తమ సర్టిఫికెట్‌తో ఈనెల 11 నుంచి 25 తేదీలోపు ఆన్‌లైన్‌లో ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల ఎంపీడీవో వెంకట్ రెడ్డి పత్రికలో ప్రకటన ద్వారా తెలిపారు. దివ్యాంగులకు ట్రై సైకిల్, బ్యాటరీ వీల్ చైర్, ప్రభుత్వం ఇస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు దివ్యాంగుల బస్సు పాస్ మేళ

నవతెలంగాణ-మెదక్‌డెస్క్

నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశం ఆదేశాలతో వట్‌పల్లి రేపు(బుధవారం) ఐకెపి కార్యాలయంలో దివ్యాంగులకు బస్సు పాస్ మేళ నిర్వహిస్తున్నట్టు ఏపీఎం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులు ఉదయం 11 గంటల నుంచి నాలుగు గంటల వరకు ఐకెపి కార్యాలయంలో సదరపు క్యాంపులో ప్రభుత్వ వైద్యులు జారీచేసిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, మూడు ఫోటోలతో మేళలో పాల్గొనిజజ ఉచిత బస్సు పాసును పొందాలన్నారు.

పేద ప్రజలకు న్యాయం జరగాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



క్రమబద్ధీకరణ పేరిట నిరుపేదల ఇండ్లు కూల్చివేయడం పట్ల మున్సిపల్ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి రెవెన్యూ యంత్రాంగం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2015లో క్రమబద్ధీకరణ పేరిట 59 జీవో కింద ఎంతోమంది నిరుపేదలు డబ్బులు చెల్లించారని గుర్తు చేశారు. కానీ నేటి వరకు వారికి ఎందుకు రిజిస్ట్రేషన్లు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ఇప్పుడు మరోసారి డబ్బులు కట్టడం లేదని.. రెవెన్యూ యంత్రాంగం కూల్చివేతలకు దిగడంపై అసహనం వ్యక్తం చేశారు. పేద ప్రజల సమస్యలపై రాజకీయాలు తగదని.. పాలకులు ప్రజల పక్షాన నిలిచి సమస్యను పరిష్కరించేల వారికి భరోసా కల్పించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ అమలు చేసి నిరుపేదల బతుకుల్లో వెలుగులు నింపాలని డిమాండ్ చేశారు.

మండలంలో రేపు ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలో ప్రభుత్వపరంగా రేపు(బుధవారం) ఇఫ్తార్ విందు కార్యక్రమం ఉంటుందని.. దీనికి ముఖ్య అతిథిగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు రానున్నట్టు తహసీల్దార్ ఆంటోని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ముంగి ఎస్ఎల్ఆర్ గార్డెన్‌లో ఇఫ్తార్ విందు ఉంటుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు పాల్గొనాలని.. అలాగే రంజాన్ పండుగకు పేద ముస్లిం మహిళలకు కోసం 500 గిఫ్ట్ ప్యాక్‌లు కూడా వచ్చినట్టు తెలిపారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడుగా పుట్ట నర్సింగరావు



నవతెలంగాణ-గుమ్మడిదల

కాంగ్రెస్ పార్టీ గుమ్మడిదల మండల నూతన అధ్యక్షుడుగా పుట్ట నర్సింగరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ నివాసంలో నియామక పత్రాన్ని నర్సింగరావు అందుకున్నారు. అనంతరం కాట శ్రీనివాస్ గౌడ్ పూలమాలలు, శాలువాతో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ.. తనపై మండల సీనియర్ నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. అందర్నీ కలుపుకొని ముందుకెళ్తానన్నారు. పార్టీని మరింత బలోపతం చేసి వచ్చే ఎన్నికల్లో అఖండ విజయం సాధించే దిశగా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్,మాజీ మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి,ఎంపీటీసీ సురభి నాగేంద్ర గౌడ్,గోవర్ధన్ గౌడ్, సత్య గౌడ్, పడమటి మహిపల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మద్దుల పెంటారెడ్డి, మండల కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



నవతెలంగాణ-కోహిర్

మండల పరిధిలోని బిలాల్పూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ డి.మోజస్‌కు ఆదివారం రాత్రి గుండెనొప్పి వచ్చింది. దీంతో అతన్ని సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మోజస్ మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఆర్థిక సాయం అందజేసి ప్రభుత్వమే ఆదుకోవాలని మృతుని భార్య గ్రామస్తులు కోరారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- తెల్లాపూర్, అమీన్పూర్ మున్సిపాలిటీల పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలకు రక్షిత మంచినీరు



నవతెలంగాణ-పటాన్‌చెరు

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్, తెల్లాపూర్ మున్సిపాల్టీల పరిధిలో నూతనంగా ఏర్పాటు అయిన గేటెడ్ కమ్యూనిటీలకు సైతం హెచ్ఎండబ్యూ ద్వారా రక్షిత మంచినీళ్ల అందించేందుకు చర్యలు చేపట్టా లని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశిం చారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో హెచ్ఎండబ్ల్యూఎస్ జీఎం నారాయణ, డిజిఎం చంద్రశేఖర్, అమీన్పూర్ మున్సిపల్ కమిషనర్ సుజాత, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌లతో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి ఇంటికి రక్షిత మంచి నీరు అందించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయానికి అనుగుణంగా పనులు చేపట్టాలని కోరారు. ఇం దుకు అనుగుణంగా రెండు మున్సిపాలిటీల పరిధిలో భారీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నామన్నారు. గేటెడ్ కమ్యూనిటీల తోపాటు నూతన కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించాలని కోరారు. వీటితోపాటు ఇప్పటికే సరఫరా అవుతున్న మంచి నీటి కనెక్షన్ సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుం డా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జహీరాబాద్ ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

నిబంధనలు పాటించని పాఠశాలకూ అనుమతులిస్తూ జహీరాబాద్ ఎంఈఓ అవినీతికి పాల్పడుతున్నాడని.. అతనిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతి పత్రం అంద జేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ.. మండల పరిధిలో గుర్తింపు లేకుండా నడుస్తున్న శాంతినికేతన విద్యాలయం, లైజియం సీబీఎస్ఈ స్కూల్, శ్రీ చైతన్య, బ్రిలియంట్ పబ్లిక్ స్కూల్, విద్యాభారత్ హై స్కూల్‌పై చర్యలు తీసుకోకుండా విద్యార్థుల జీవితాలను ఆగం చేస్తున్నారని మండిపడ్డారు. వీరి నిర్లక్ష్యంగా ఎనిమిది మంది పదో తరగతి విద్యార్థులు బోర్డ్ ఎగ్జామ్స్ రాయలేకపోయారన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఆట స్థలం, పీఈటీలు తప్పని సరిగా ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ.. జహీరాబాద్ పట్టణంలో ఉన్న 90శాతం స్కూళ్లు వాటిని పాటించడం లేదని ఆరోపించారు. కానీ ఎంఈఓ మాత్రం అనుమతులు, రెన్యూవల్‌కు అవకాశాలు ఇస్తున్నాడన్నారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నారు ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ సునీల్, శివ సాయి, సురేష్ భవన్, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏలను సెల్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-గుమ్మడిదల

ఐకెపి వీవోఏలను సెల్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని.. వారిక రూ.10 లక్షల సాధారణ భీమా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని వీవోఏల సంఘం మండలాధ్యక్షురాలు జే.మాధవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రిలే నిరాహార దీక్షలో చేపట్టిగా.. వారికి బీజేపీ రాష్ట్ర నాయకులు, అమీన్పూర్ కౌన్సిలర్ ఎడ్ల రమేష్ సంఘీభావం తెలిపారు. ఎన్నో ఏండ్ల నుంచి గ్రామాల్లో మహిళల జీవనోపాధి మెరుగుపడే విధ ంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను చేరే విధంగా కృషి చేస్తున్న గ్రామ మహిళా సమైక్య సంఘాల వీఏఓల సమ స్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ ఎడ్ల రమేష్ డిమాండ్ చేశారు. ఐకెపి వీవోఏలను సెల్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించి కనీస 26,000 అందించాలన్నారు. రూ.10 లక్షల సాధారణ భీమా ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ నుంచి ఐడి కార్డు ఇవ్వాలని కోరారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతీ నెల వేతనాలను వీవోఏల వ్యక్తిగత ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీవోఏలను సీసీలుగా ప్రమోద్ కల్పించాలని డిమాండ్ చేశా రు. కాగా తమ సమస్యలు పరిష్కరించే వరకు ఈ పోరాటం ఆగదని మహిళా సంఘాల వీవోఏలు ప్రభుత్వానికి హెచ్చ రించారు. ఈ నిరసనలో మండల ఐకేపీ వీవోఏల సంఘం సభ్యులు రజిని, మాధవి, కల్పన, బుచ్చమ్మ, బండి లక్ష్మి పలువురు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు పోతాం



నవతెలంగాణ-న్యాల్‌కల్

ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఈనెల 28వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం పంచాయతీరాజ్ కమిషనర్‌కు, జిల్లా డిపిఓకు, వివిధ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. సమ్మె చేయడానికి కార్యచరణ సిద్ధం చేశామని.. 4 ఏండ్లు అయినా రెగ్యులేషన్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని పంచాయతీ కార్యదర్శులు సంతోష్ కుమార్ అన్నారు. సీనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని చేశారు. లేనియెడల సమ్మె తప్పదని హెచ్చరించారు. నిరసన తెలిపిన వారిలో ఈశ్వర్, సునీల్ సింగ్, అరుణ జ్యోతి, చరణ్ రాజ్, లక్ష్మి, తదితర కార్యదర్శులు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కల్హేర్

సిర్గాపూర్ మండలంలోని అంతర్గావ్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు క్యాంపస్ శిబిరాన్ని స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి విజయ్‌కుమార్ మాటాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ ఆందోత్వ నివారణ కోసమే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ పథకం ద్వారా 18 సంవత్సరాల పైబడిన వారందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహి స్తారన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు క్యాంపు శిబిరాల వద్ద ప్రజలు ఒక కంటి పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన వారికి ఉచితంగా అద్దాలను సైతం ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఎక్కువగా ప్రాబ్లం ఉంటే జిల్లా కేంద్రం ఆసుపత్రికి రిఫర్ చేసి ఆపరేషన్ సైతం ఉచితంగా అని ప్రభుత్వం చేస్తుందన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి కంటి వెలుగు పై అవగాహన కల్పిస్తున్నారు అన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక గ్రామ ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. సోమవారం రోజు అంతర్గావ్ గ్రామంలో 222 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు మెడికల్ ఆఫీసర్ శ్రీరంగనాథ్, పిహెచ్ఎన్ నిర్మల, ఎం పిపెచ్ఎలు రామచందర్, తారాసింగ్, అర్థమట్రిస్ట్ సరిత, క్యాంపు డీఈవో ప్రవీణ్, ఏఎన్ఎంలు కృష్ణవేణి, పుష్పలత, పంచాయతీ కార్యదర్శి మీనా, ఆశా కార్యకర్తలు లక్ష్మీ, స్వప్న, అంగన్వాడీ కార్యకర్తలు రేణుక, మీనా తదితరులు పాల్గొన్నారు.



కూతురిపై లైంగికదాడికి పాల్పడ్డ తండ్రికి యావజ్జీవ కారగార శిక్ష

నవతెలంగాణ-అమీన్‌పూర్

కూతురిపై లైంగికదాడికి పాల్పడ తండ్రికి యావజ్జీవ కారగార శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా కోర్టు (పోక్సో ప్రత్యేక కోర్టు) జడ్జి సుదర్శన్ తీర్పు ఇచ్చినట్టు అమీన్పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ శ్రీనివాసులు రెడ్డి వివరాల ప్రకారం..అమీన్పూర్ మండలంలో 2021 ఆగస్టు 24వ తేదీన.. ఓ వ్యక్తి తన 12ఏండ్ల వయస్సు గల కూతురిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద ప్రస్తుత సీఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపారు. కేసు వాదోపవాదనలు విన్న అనంతరం.. నింది తుడకి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జడ్జి సుదర్శన్ తీర్పు ఇచ్చారు. బాధితుల పక్షాన.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత రావు కులకర్ణి వాదనలు వినిపించారు. సాక్షాలు సమర్పించడంలో కీలకంగా వ్యవహరించిన కోర్టు కానిస్టే బుళ్లు సోమ్లా నాయక్, మహేందర్‌లను సిఐ అభినందించారు.



పంచవటి కుంభమేళకు ముమ్మర ఏర్పాట్లు

నవతెలంగాణ-న్యాల్‌కల్

పవిత్రమైన మంజీరా నది తీరాన రాఘవపూర్-ఉన్నాపూర్ శివారులో గల సరస్వతి పంచవటి క్షేత్రంలో ఈనెల 24 నుంచి మే 5 తేదీ మహా గరుడ కుంభమేళ జరగనున్నది. అయితే ఈ మేళకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు, సాధువులు వస్తుంటారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కుంబమేళకు ఏర్పాటు పూర్తి చేస్తున్నారు. మంజీరా నది తీరాన స్థానపు ఘట్టాలు, పరిశుభ్రత, చెత్త తొలగింపు లాంటి కార్యక్రమాలు చురుగ్గా కొనసాగుతున్నాయని న్యాల్కల్ మండల ఎంపీడీవో వెంకట్ రెడ్డి తెలిపారు.

రైతుల భూముల్లో పనులు ఆపండి

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రంలోని కొంతమంది రైతుల భూముల్లో వారి అనుమతి లేకుండా భూములు చదును చేస్తూ.. ముళ్ళ కంచెను ఏర్పాటు చేయడాన్ని వెంటనే ఆపాలని కోరుతూ జిన్నారం మాజీ ఎంపీటీసీ పొట్టి భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం జిన్నారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిన్నారం గ్రామ సర్వేనెంబర్ 01లో 420 ఎకరాలు మరియు సర్వే నెంబర్ 376లో 163 ఎకరాలు మొత్తంగా 583 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. అయితే టీఎస్ఐఐసి, హెచ్ఎండిఏ లేఔట్లకు కొంతమంది రైతులు భూమిలివ్వగా.. మరికొందరు ఇవ్వలేదు. మరో కొద్ది మంది రైతులు మంది రైతులు తమ వ్యవసాయ భూములు ఇవ్వలేదన్నారు. ఈ అంశం కోర్టులో ఉన్నా కూడా కొందరు అక్రమంగా అక్రమంగా జెసిబి హిటాచిలు తీసుకోవచ్చు కొద్ది రోజులుగా పనులు చేస్తున్నారని రెవెన్యూ అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. ఈ విషయమై ఆర్ఐ జయప్రకాష్ నారాయణ,వ ండల సర్వేయర్ రామభద్రం సర్వే నెంబర్ ఒకటి భూముల వద్దకు వచ్చి పరిశీలించారు. పనులు కొనసాగుతుండగా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో పనులు నిలుపుదల చేశారన్నారు. రైతులతో అధికార బృందం ఓ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేసినట్లు మాజీ ఎంపీటీసీ పొట్టి భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్లంగోని దుర్గయ్య, దోమడుగు రమేష్ మోర బిక్షపతి,పుట్టి బిక్షపతి, పోచమ్మ స్వామి, తొర్రి సాయిలు, ఎల్ నరేందర్ రెడ్డి,ఎర్రవల్లి లక్ష్మి, కొండకళ్ళ ఎల్లమ్మ ,గోపగోని రాజు గౌడ్,దోమడుగు శంకర్, నీలం సత్యనారాయణ,వి.సుదర్శన్,నీలం రాము,ఎర్రవాలి యాద య్య, గోపగోని లక్ష్మి పలువురు రైతులు పాల్గొన్నారు.



పేపర్ల లీకేజి- ప్రభుత్వ వైఫల్యంపై అఖిల పక్ష సమావేశం



నవతెలంగాణ-సంగారెడ్డి

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజి-ప్రభుత్వ వైఫల్యం పై సంగారెడ్డి జిల్లా తెలంగాణ జన సమితి అధ్యక్షులు పి.తుల్జారెడ్డి ఆధ్వర్యంలో పోతిరెడ్డిపల్లిలోని మంజీరా హోటల్‌లో సోమవారం అఖిల పక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ నాయకులు జూలకంటి ఆంజనేయులు, బీఎస్పీ జిల్లా నాయకులు మల్లయ్య, ఆప్ జిల్లా నాయకులు పట్లోళ్ల సంతోష్‌రెడ్డి, తెలంగాణ జన సమితి మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, యువజన సమితి జిల్లా అధ్యక్షుడు డి పాండు, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేష్, టీజేఎస్ మహిళా నాయకురాలు, సి నాగమణి, టీజెస్ నాయకులు, రాం రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వి వి గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, టీఎస్‌పీఎస్సీ పాలక వర్గాన్ని రద్దు చేయాలని, టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు(మంగళవారం) హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే అఖిలపక్ష ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పేదల ఇళ్లు కూల్చేస్తే చూస్తూ ఊరుకోం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న పేద ప్రజల ఇల్లు కూల్చివేస్తే చూస్తూ ఊరుకోబోమని బొల్లారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. సోమవారం బొల్లారం పరిధిలోని పలు ప్రాంతాల్లో 59 జీవో కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు నిర్ణీత ధర చెల్లించనందుకు ఇళ్లు కూల్చి చేయడానికి గానూ రెవెన్యూ అధికారులు వచ్చారు. మార్కెట్ రేటు ప్రకారం రూ.2.70 లక్షలు కట్టాలని.. గాంధీనగర్‌కి చెందిన నరసింహకు రెవెన్యూ అధికారులు నోటీసు ఇచ్చారు. లబ్దిదారుడు పేదవాడు కావటంతో ఆ డబ్బులు కట్టలేదని.. అయితే రెవెన్యూ అధికారులు ఆ ఇంటిని కూల్చివేయటానికి పూనుకున్నారు. దీంతో బాధితులు ఆనంద్ కృష్ణారెడ్డికి తెలపడంతో ఆయన బీజేపీ కౌన్సిలర్లు సాయికిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, రవీందర్ రెడ్డి, లక్ష్మణ్ స్వామి, రోహిత్ సింగ్, శారద తదితరులతో అక్కడికి చేరుకుని రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇళ్ల క్రమబద్ధీకరణ చేసుకుని దానిపై బ్యాంకు నుండి ఋణ సదుపాయం తీసుకోవాలని, లేదా మరో రకమైన ఆర్థిక ప్రయోజనం పొందవచ్చు అనే ఉద్దేశంతో పేదలు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాంటి వారిపై అధికారులు జులుం చూపించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ఆరోపించారు. డబ్బులు చెల్లించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరడంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగి వెళ్లారు.



అవగాహనతోనే హార్ట్ ఎటాక్ దూరం



నవతెలంగాణ-కల్హేర్

అవగాహనతోనే హార్ట్ ఎటాక్(గుండె జబ్బు) దూరమవుతుందని సిర్గాపూర్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో ఎంపీడీవో ఆధ్వర్యంలో సీపీఆర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. ఇటీవల మధ్యకాలంలో యువకుల్లో ఎక్కువగా గుండెజబ్బు రావడంతో హఠాన్మరణం చెందుతున్నారన్నారు. ఈ గుండె జబ్బు పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించడం కోసమే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశా మన్నారు. ఎవరికైనా అనుకోకుండా అకస్మాత్తుగా కాళ్లు తిమ్మిర్లు రావడం, ఛాతిలో నొప్పి లాంటి లక్షణాలతో స్పృహ కోల్పోతే.. వెంటనే చాతిలోని ఎడమ భాగం వైపు ఎడమ చేతితో బ్లాక్ చేసి నిమిషానికి సుమారు 120 సార్లు గట్టిగా ప్రెస్ చేయాలన్నారు. అనంతరం దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో సుజాత, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-నారాయణఖేడ్

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్టీసీ సిబ్బంది కృషి చెయ్యాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుదర్శన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ... బసవేశ్వర చౌక్, రాజీవ్ చౌక్, మంగల్ పేట బస్టాండ్, బస్ డిపోను తనిఖీ చేశారు. ఆర్ఎం మాట్లాడుతూ... బసవేశ్వర చౌక్‌లో ప్రయాణికులు కూర్చోవడానికి చిన్న మినీ బస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిష నర్‌ని కోరారు. అక్కడ ప్రయాణికులు చాలా ఇబ్బందికరంగా రోడ్లపైనే కూర్చుంటున్నారన్నారు. వాళ్ళ ఇబ్బందులు తొలగా లంటే ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని డిపో మేనేజర్ మల్లేషయ్యను కోరారు. ఆర్ఎం మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి రాఘవపూర్‌లో కుంభమేళా జరుగుతున్నందున.. అందుకు సరిపోను జహీరాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్, బీదర్‌కు స్పెషల్ బస్సులు తిప్పాలని డిఎంను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ పాండు తదితర ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



యువజన విభాగం నాయకుడి మృతికి ప్రగాఢ సానుభూతి

నవతెలంగాణ-గుమ్మడిదల

యువజన విభాగం నాయకుడు భాస్కర్ మృతికి బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత, గుమ్మడిదల మాజీ ఉప సర్పంచ్ ఎం నరేందర్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంతేకాకుండా ఆ కుటుంబానికి తనవంతుగా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు వార్డు సభ్యులు ఆకుల ఆంజనేయులు, అతినారం రాము నాయకులు, దాసరి ఆంజనేయులు యాదవ్, ఎండి గౌస్, మేకల యాదగిరి, కూరగాయల నర్సింలు, కాజా బాయ్, నిమ్మ సంతోష్ రెడ్డి, కొత్త కృష్ణ, శ్రీకాంత్ చారి, తునికి సుధాకర్, కొత్తపల్లి రమేష్, మద్దటి నర్సింలు, పాదాల మహేష్, ఆందోల్ కృష్ణ, సత్యనారాయణ, దాసరి శ్రీనివాస్, మరియు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్రానికి నిధులను ఇవ్వడం లేదు

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

నవ తెలంగాణ-కొమురవెల్లి

బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇవ్వడం లేదని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లెనిన్ నగర్ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి, రూ.8 లక్షలతో కమ్యూనిటీహాల్, రూ 5లతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ సనాది సబిత, ఎంపీటీసీ దుర్గారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం కమ్యూనిటీ భవనానికి స్థలాన్ని ఇచ్చిన దాసరి నర్సింహులు దంపతులను సన్మానించి పాదాభివందనం చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చిన్న గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి వాటిని అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన మొత్తం నుంచి రాష్ట్రానికి రావల్సిన వాటా ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను తీర్చాలంటూ సర్పంచ్ సబిత ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. జడ్పీటీసీ సిద్దప్ప, కొమురవెల్లి



మల్లన్న ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, మచ్చేందర్, సనాది భాస్కర్, మల్లారెడ్డి, కె.రవీందర్ రెడ్డి, ఆకుల సత్తయ్య, నర్సింహారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హెరిటేజ్ డైరీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాక మండలం ఆకారం గ్రామంలో హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ రీజినల్ హెడ్ కేబి నర్సింగరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో లాభనష్టాలు సాధారణమయ్యాయని తెలిపారు. పాడి పశువులపై శ్రద్ధ పెరిగి గ్రామీణ రైతులు రోజు వారి ఆదాయం కోసం వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. హెరిటేజ్ ఒప్పందం చేసుకున్న ఏపీజీవిబి బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా రైతులు రుణాన్ని తీసుకొని కొనుగోలు చేసిన పశువులుగాని అర్ధాంతరంగా మరణిస్తే రైతుల పరిస్థితి దుర్భరంగా మారుతుందని చెప్పారు. వివిధ కారణాలతో మృత్యువాత పడితే రైతులకు కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. తిరిగి పశువులను కొనుగోలు చేయాలంటే రైతులు అప్పులు చేయవలసి వస్తుండగా... ఈ నేపథ్యంలో పాడి పశువులను కోల్పోయిన రైతులు నష్టపోకుండా ఉండడానికి హెరిటేజ్ సంస్థ ఇఫ్కో టోకియా ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని రాయితీపై పశు బీమాను కల్పిస్తుందని ఈఅవకాశాన్ని రైతులు వినియోగించు



కోవాలన్నారు. తదనంతరం గ్రామ సర్పంచ్ కాస నాగభూషణం మాట్లాడుతు హెరిటేజ్ పాలకేంద్రం వారు రైతులకు ఇలాంటి అవగాహనా సదస్సు పెట్టి రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట మేనేజర్ మల్లేశం,గ్రామ ఉపసర్పంచ్ మహేందర్ గౌడ్, పాల సేకరణ ప్రతినిధి శంకరయ్య, సూపర్వైజర్ పరమేశ్వర్ రెడ్డి, పాడి రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నియమనిష్టలకు ప్రత్యేకత రంజాన్



నవతెలంగాణ-బెజ్జంకి

ఉపవాసములు, ప్రార్థనలు, దానధర్మాలతో నెల రోజుల పాటు నియమనిష్టలతో గడపడమే రంజాన్ మాసం ప్రత్యేకతని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కొనియాడారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక నర్మద గార్డెన్ యందు మండలంలోని ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ పండగ కానుకలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తహసిల్దార్ విజయ ప్రకాశ్, అయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ అనుబంధ కమిటీల నాయకులు, మండలంలోని అయా గ్రామాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

తెలంగాణ రాష్ట్రానికి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచి ఆదర్శమైందని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ మదీనా మజీద్‌లో మున్సిపల్ చైర్మన్ ఎన్. సి రాజమౌళి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించాక సీఎం కేసీఆర్ గజ్వేల్ మున్సిపాలిటీ రాష్ట్ర రాష్ట్రానికి ఆదర్శంగా నిలుపుతానన్న హామీని నెరవేర్చారన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్ మున్సిపాలిటీ కోట్ల నిధులతో అభివృద్ధిలో అగ్రగామిగా ఉంచారన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ హిందూ ముస్లింలు వేరువేరు కాదని తామంతా కలిసి ఒకరికి ఒకరు కలిసికట్టుగా ఉంటూ అన్నింట్లో ముందు ఉంటామన్నారు. అన్ని వర్గాల పండగలకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తున్నారన్నారు. గజ్వేల్ పట్టణ మైనార్టీల సంక్షేమం



కోసం వ్యాపార సముదాయం షాదీఖాన, మైనార్టీ విద్యార్థుల సంక్షేమం కోసం బాలుర బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు కట్టించారన్నారు. అంతేకాకుండా ఆడబిడ్డల పెళ్లి కోసం షాదీ ముబారక్, పథకాలను అందిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మదత రమేష్ , వైస్ చైర్మన్ జక్కి ఉద్దీన్, టౌన్ ప్రెసిడెంట్ నవాజ్ మీరా, తంజుముల్ మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ యూసఫ్,హజ్ కమిటీ మెంబెర్ జాఫర్ ఖాన్, స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిద్దిపేట జిల్లా ఇవిఫ్ యువజన అధ్యక్షులు ఎన్. సి సంతోష్,ఎఫ్ ఎఫ్ యా మిత్రబృందం, ఆల్ మదర్ ఫౌండేషన్ అజార్ అండ్ వారి టీమ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ గురుకులాల్లో జరిగిన ఘటనలపై సమగ్ర విచారణ జరపాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్

నవతెలంగాణ-సంగారెడ్డి



ఆర్సిఓల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని గురుకులాల్లో విద్యార్థులు చనిపోయిన ఘటనలపై సమగ్ర విచారణ జరపాలని, అందుకు కారణమైన ప్రిన్సిపాల్స్, వార్డెన్స్, ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి లోని కేవీపీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో అతిమేల మానిక్ మాట్లాడుతూ ఇటీవల నారాయణఖేడ్ గిరిజన గురుకులంలో విద్యార్థి మిస్సై చెరువులో శివమై తేలినాడన్నారు. సిర్గాపూర్ ఎస్సీ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని రెండంతస్తులపై నుండి పడి చనిపోయిందన్నారు. సిర్గాపూర్ మైనార్టీ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని గర్భం దాల్చారన్నారు. గతంలో ముత్తంగి మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో ఇంటర్ విద్యార్థిని చనిపోయారన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న ఆర్సిఓల పర్యవేక్షణ లేదన్నారు. నిర్లక్ష్యం వహించిన ఆర్సిఓలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, మూడెకరాల భూమి ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వం హెచ్చరించారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు దాస్, రైతు సంఘం నాయకులు సంతు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు హోమియోపతి మందుల పంపిణీ

నవతెలంగాణ-చేర్యాల : ఏకలవ్య ఫౌండేషన్ సహకారంతో నాగపురి రైతు సేవ ఉత్పత్తిదారుల సంస్థలో ఉన్న మండల పరిధిలోని నాగపురి, పెదరాజుపేట, శభాష్ గూడెం, పోతిరెడ్డిపల్లి గ్రామాల రైతులకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు హోమియో మందులను సోమవారం నాగపురి గ్రామంలో పంపిణీ చేశారు. ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ నాగపురి సర్పంచ్ శ్రీ సంతోషి- కరుణాకర్, ఉప సర్పంచ్ ఎల్లేశం, పంచాయతీ కార్యదర్శి సందీప్, నాగపురి రైతు సేవ ఎఫ్ పీ సీ చైర్మన్, ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టీ జక్కుల తిరుపతి, వైస్ చైర్మన్ దేవన బోయిన శ్రీనివాస్, ట్రెజరర్ జీడల సురేష్ ,డైరెక్టర్లు ఉల్లంపల్లి కనకమ్మ, ఆవుల మహేందర్, సీఈఓ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-చేర్యాల : బిల్డింగులకు పెయింటింగ్ వేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడి రెండు కాళ్లను కోల్పోయిన మండల పరిధిలోని కడవేరుగు గ్రామానికి చెందిన పెయింటర్ కొమ్ముల చంద్రమౌళిని, అలాగే ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన అదే గ్రామానికి చెందిన అవుసుల నాగరాజు కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఉల్లెంగల సేవ ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల ఏకానందం సోమవారం పరామర్శించి ఇరువురి కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచ్ కొమ్ముల సప్న, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు తాటికొండ సదానందం, గ్రామ శాఖ అధ్యక్షుడు సిద్ది లింగం,వార్డు సభ్యుడు శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ నాయకులు,శ్రీనివాస్, నారాయణ, నర్సయ్య, సోషల్ మీడియా అధ్యక్షుడు నాగేంద్ర, నాగరాజు, వెంకటేష్, దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పంచాంగ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

అక్బరుపేట భూంపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో సోమవారం తెలుగు పంచాంగ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు తాళ్ల రాజు, ఉపాధ్యాకులు బొల్లిపల్లి నారాయణ (నందు), ప్రధాన కార్యదర్శి కడవేర్గు స్వామి,కోశాధికారి దావత్ సత్తయ్య, సహాయ కార్యదర్శి గుజ్జేటి బాలరాజు, వివిధ గ్రామ అధ్యక్షులు, సభ్యులు పేంటే కిషన్, దిడ్డి సాయి కిరణ్,కోట సత్యనారాయణ, అరుగొండ యాదగిరి, కొంపల్లి రమేష్, కోట భువనేశ్వర్, శ్రీరామ్ సంతోష్, దావత్ వెంకటేశం, దావత్ నర్సింలు తదితరులు ఉన్నారు

కుర్చీలు లేవని నేలపైనే సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని చెంచల్‌చెర్వుపల్లి గ్రామ సర్పంచ్ భీంరెడ్డి సత్యవతి ఇటీవల విదేశాలకు వెళ్లడంతో ఉపసర్పంచ్ ఎల్లబోయిన ఎల్లయ్య ఇంఛార్జీ సర్పంచ్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించాడు. దీంతో సోమవారం జనరల్ బాడీ మీటింగ్‌లో భాగంగా గ్రామపంచాయితీ కార్యాలయంలో మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. కాగా గ్రామ పంచాయతీలో ఒక్క కుర్చీ కూడ లేకుండా స్టోర్ రూంలో సర్పంచ్ భర్త వేయించారని ఉపసర్పంచ్ ఎల్లయ్య విలేకరులతో తెలిపారు. కావాలనే ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో నేలపైనే కూర్చొని గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో సభ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కుర్చీలు లేకుండా చేయడంపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఇంఛార్జీ సర్పంచ్ ఎల్లయ్య తెలిపారు. దీనిపై సర్పంచ్ భర్త భీంరెడ్డి రాజిరెడ్డిని ఫోన్‌లో సమాచారం అడగగా తాను గ్రామ పంచాయతీకి వెళ్లనేలేదని, అలా నిరూపిస్తే దేనికైనా సిద్ధమే అన్నారు. అలాగే గ్రామపంచాయితీలో కుర్చీలు, సంబంధిత వస్తువులు ఎక్కడ ఉండాలనేది కార్యదర్శి, సర్పంచ్‌ల ఇష్టానుసారమైందన్నారు. కావాలనే కుర్చీలను తీసి కార్యదర్శి, ఇంఛార్జీ సర్పంచ్ ఎల్లయ్యలు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కావాలనే కుర్చీలు తీసి వార్డు సభ్యులను క్రింద కూర్చోబెట్టి అవమానించారని ఆయన ఆరోపించారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ





పలువురికి స్వల్ప గాయాలు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ డిపోకి చెందిన టీఎస్ 35 టీ 7529నంబర్ గల ప్రైవేట్ ఆర్టీసి బస్సు సోమవారం సిద్దిపేట వెళ్తుంది.ఐతే దుబ్బాక మండలం తిమ్మాపూర్ స్టేజి దాటిన తర్వాత కొద్దిదూరంలో ప్రయాణికులు బస్సును ఆపి ఎక్కుతుండగా దుబ్బాక డిపోకు చెందిన టీఎస్ 36 టీఏ 3326 నంబర్ గల బస్సు బస్సు వెనుకాల నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో ముందు ఉన్న మెదక్ డిపో బస్సు వెనుకాల అద్దం, బంపర్ ధ్వంసం కాగా దుబ్బాక డిపో బస్సు ముందు భాగం అద్దం, బాడీ డ్యామేజ్ అయ్యాయి. ఈ ఘటనలో ముందు బస్సు వెనక సీటులో కూర్చున్న భూంపల్లి గ్రామానికి నాంపల్లితో పాటు పలువురికి గాయాలయ్యాయి.

నల్ల బ్యాడ్జీలతో జేపీఎస్, ఓపీఎస్‌ల నిరసన



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో మేరకు తమను క్రమబద్దీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త పోరాటంలో భాగంగా టి పి ఎస్ ఎఫ్ స్టేట్ కమిటీ పిలుపుమేరకు సోమవారం సిద్దిపేటలో జేపీఎస్ ఓపిఎస్ అర్బన్ మండల కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేపీఎస్, ఓపిఎస్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమను గుర్తించి క్రమబద్దీకరించే వరకు నిరంతర పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో వినోద్, శీలత, సతీష్, శ్రీవాణి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని కాచాపూర్ గ్రామ సర్పంచ్ ఎనగందుల తిరుపతి తండ్రి రామయ్య ఇటీవల మృతి చెందగా సర్పంచ్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, ఎంపీటీసీ తూటి సుజాత బాపురెడ్డిలు పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చెంచల్ చెర్వుపల్లి ఇంఛార్జీ సర్పంచ్ ఎల్లబోయిన మల్లేశం, రేవోజు రవి, గౌరబోయిన సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా నలు మూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. భూ సమస్యల పరిష్కారానికి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఆసరా పెన్షన్లు, ఉపాధి కల్పనకు, దివ్యాంగుల ఉపకరణాలు,బ్యాటరీ సైకిల్ కోసం, తదితరాలపై (32) దరఖాస్తులు వచ్చాయని, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి (17) ఆర్జీలు అందగా, గ్రామీణ అభివృద్ధి సంస్థ , ఐ సి డి ఎస్,హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించి (15) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ ఏవో పాల్గొన్నారు.

నవ తెలంగాణ కొండపాక: ప్రజావాణి గొప్ప కార్యక్రమమని డిఆర్ఓ లక్ష్మీ కిరణ్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో



డీఆర్ఓ లక్ష్మి కిరణ్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు పరిష్కరించుకొవడానికి అర్జీదారులు ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్ఓకు అర్జీలు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకొవడానికి ఒక చక్కని వేదిక ఈ ప్రజావాణి అన్నారు. సమస్యలున్న వారు ఎంతో నమ్మకంతో కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే విధంగా పని చేయాలని జిల్లా అధికారులను



ఆదేశించారు. భూ సంబంధిత, రెండు పడక గదుల ఇళ్లు, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 41 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ మెదక్ రూరల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్డీఓ శ్రీనివాస్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదీదారుల నుంచి 89



వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో సత్యసాయి సేవా సంస్థ, హవేళిఘనపూర్ గ్రామానికి చెందిన రాజ రాజేశ్వరి బిన్నీ మాడ్రన్ రైస్ మిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా అధికారులు వెంకట శైలేష్, సాయిబాబ, విజయశేకర్ రెడ్డి, నాగరాజ్, ఆశాకుమారి, బహ్మాజి, ఇందిరా, జెంలా నాయక్, కమలాకర్, రాధాకిషన్, నర్సయ్య, శశిభూషణ్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ. యూనుస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలి





నవ తెలంగాణ- దౌల్తాబాద్

సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని మెడికల్ ఆఫీసర్ ఆశ్లేష అన్నారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బందికి మెడికల్ ఆఫీసర్ ఆశ్లేష కార్డియోపల్మోనరీ రిససిటేషన్ గురించి శిక్షణ ఇచ్చారు. గుండెపోటు, విద్యుత్ షాక్, నీటిలో మునక ప్రమాదాలు సంభవించినప్పుడు సడన్‌గా గుండె ఆగిపోతే అప్రమత్తమై ఛాతీపై ప్రెస్ చేయడం (కార్డియోపల్మోనరీ రిససిటేషన్) ద్వారా తిరిగి గుండె కొట్టుకునేలా చేయవచ్చన్నారు. ఈ విధానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ దండి సుజాతా, ఎంపిడిఓ రాజేశ్ కుమార్, నయాబ్ తహశీల్దార్ జహీర్, ఈవోపీఆర్డీ సయ్యద్ గఫూర్ ఖాద్రీ,గిర్ధావర్ మధు,సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులున్నారు.

నవతెలంగాణ జగదేవపూర్: జగదేవపూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బాలేశం గౌడ్ అధ్యక్షతన ఎంపీడీవో సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాలేశం గౌడ్, డా. రాజశేఖర్ మాట్లాడుతూ ఇటీవల గత కొంది కాలంగా ఎక్కువ మంది గుండె నొప్పి తో మరణిస్తున్నారని, గుండె నొప్పి అనేది ఏ వయస్సు అనేది తేడాలేకుండా, ఎవ్వరికి చెప్పి రాదు అని అలాంటి ప్రమాదం లో ఉన్న వ్యక్తి ని వెంటనే రక్షించాలంటే సిపిఆర్ చేయడం పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. డాక్టర్ రాజశేఖర్ పంచాయతీ కార్యదర్శులకు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది గుండె నొప్పి వచ్చిన వారిని సిపి ఆర్ చేసి ప్రాణాలను ఎలా రక్షించవచ్చునని ప్రయోగ పూర్వకమైన శిక్షణ ద్వారా అవగాహన కల్పించారు. ఎంపీపీ బాలేశం గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలతో కలసి పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు తప్పకుండ సిపి ఆర్ పై అవగాహన కలిగి ఉండి గుండె నొప్పి తో ఎవరైనా భాధ పడుతుంటే ధైర్యం తో సిపి ఆర్ చేసి ప్రాణాలను రక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ శ్రీనివాస్ వర్మ, మండల్ కో అప్షన్ సభ్యులు సయ్యద్ ఎక్బల్, ఎస్ ఐ కృష్ణ మూర్తి, తహసీల్దార్ రఘువీరారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మజార్, జూనియర్ అసిస్టెంట్ అనిత, యాదయ్య, పంచాయతి కార్యదర్శులు తిరుపతి, మల్లేశం, కృష్ణ రెడ్డి, సతీష్, ఈ పంచాయతీ ఆపరేటర్ లు కృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ -పాపన్నపేట



ఏడుపాయల వనదుర్గామాత దేవాలయం సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు వద్ద సోమవారం ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం వివరాలు... టేక్మాల్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన వడ్డెర హన్మంతు(72) కూలీ పనులు చేసుకుంటున్నడు. ఆదివారం వనదుర్గామాత దర్శనం కోసం ఇంటి నుంచి ఏడుపాయలకు వచ్చాడు. అమ్మవారి దర్శనం అనంతరం సమీపంలోని వనదుర్గ ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. అక్కడ ప్రసాదం తిన్న తర్వాత చేతులు కడుక్కోవడానికి డ్యాంలోకి దిగాడు. ప్రమాదవశాత్తు జారిపడి మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు చుట్టూ పక్కల వెతికారు. సోమవారం వనదుర్గ ప్రాజెక్టు వద్ద నీటిలో వెతకగా ఓ మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృత దేహాన్ని పంచనామా నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుమారుడు భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫీజు చెల్లించకపోతే దరఖాస్తుల తిరస్కరణ

నవతెలంగాణ - అమీన్ పూర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 59 జీఓ కింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం ఇచ్చిన అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని అమీన్‌పూర్ తహసీల్దార్ దశరథ్ తెలిపారు. క్రమబద్ధీకరణకు సంబంధించి నిర్దేశిత ఫీజును చెల్లించకపోతే సదరు దరఖాస్తులు తిరస్కరించబడతాయని పేర్కొన్నారు. అట్టి ఇండ్ల స్థలాలను సైతం తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం లేకపోలేదని తెలిపారు. దీనిపై అమీన్ పూర్ మండలంతో పాటు మున్సిపాలిటీ ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్న అనుమానాలున్న తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ పథకాలకు అడ్డుపడుతున్న ప్రతిపక్షాలు





జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే, ఓర్వలేని ప్రతిపక్షాలు సంక్షేమ పథకాలకు అడ్డుపడుతూ, అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్నారని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పట్టణ కమిటి ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉంటే చూడలేని బిజెపి ,కాంగ్రెస్ పార్టీల కళ్ళు మండుతున్నాయని, పరిపాలన చేతగాని బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెంపపెట్టు లాగా కేసీఆర్ పరిపాలన కొనసాగుతుందని తెలిపారు. జనగామ నియోజకవర్గంలో ఎన్నడూ కనబడని ప్రతిపక్ష పార్టీ నాయకులు ఎలక్షన్లు వస్తున్నాయని ఊరురు, వాడ వాడ తిరుగుతూన్నారని , వారు చెప్పే మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. రాష్ట్రం మీద ప్రతిపక్షాలకు ప్రేమ ఉంటే ప్రాంత అభివృద్ధికై పాటుపడాలని హితవు పలికారు. ప్రజలు చాలా తెలివిగలవారని కెసిఆర్ మీద ప్రేమతో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ అంకుగారి స్వరూపరానీ శ్రీధర్ రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీష్, జుబేదా ఖాతున్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బాల్ నరసయ్య, బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో రూ. 1 కోటి 25 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంబేద్కర్ భవన నిర్మాణ పనులను జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితుల అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ద్యేయమని, దళితులను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూప రాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్ చంటి,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య, కౌన్సిలర్ లు ఆడెపు నరేందర్, ముస్త్యాల తార యాదగిరి, చేర్యాల మాజీ సర్పంచ్ ముస్త్యాల అరుణ, గుస్క రాందాస్, భూమిగారి రత్నం, రామగల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమరేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

నవ తెలంగాణ రాయపోల్



పేద ప్రజలకు కడుపునిండా అన్నం తినడానికి ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తే కొంతమంది అక్రమార్కులు వాటిని కవత ధరలకు విక్రయించి వ్యాపారం చేస్తున్నారని అలాంటి అక్రమార్కుల పై చట్టాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని బేగంపేట ఎస్సై అరుణ్ అన్నారు సోమవారం అక్రమంగా తరలిస్తున్న 76 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో నమ్మదగిన సమాచారం మేరకు బేగంపేట గ్రామ శివారులో రెండు టాటా ఏసీ ఆటోలను తనిఖీ చేయగా అందులో ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని నిందితులను విచారించగా వివిధ మండలాలలో చుట్టుపక్కల గ్రామాలలో తక్కువ ధరకు ప్రభుత్వం రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు రైస్ మిల్లలలో తదితర ప్రదేశాల్లో అమ్మడానికి తీసుకొని వెళుతున్నామని తెలుపారు. ఇద్దరు నిందితులు మాలోతు రమేష్ తండ్రి షకీరామ్ గ్రామం రావణ్కోల్ జిల్లా మేడ్చల్, సుబావత్ అరుణ్ తండ్రి పిడిలాల్ గ్రామం రావణ్కోల్, జిల్లా మేడ్చల్ కి చెందిన వారని పేర్కొన్నారు.2 ఆటోలు అశోక్ లేలాండ్ నెంబర్లు %ూ 03 ఖజ-3620, ూ 35 ు%-4284 గల వాహనాలను అందులో ఉన్న పిడిఎస్ రైస్ ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం ఇతరులకు అమ్మిన, ఇతరుల వద్ద నుండి కొనుగోలు చేసిన, అక్రమంగా రవాణా చేసే వారిపై సమాచారం అందించాలని లేదా డయల్ 100 కు కాల్ చేసి తెలపాలని సూచించారు. ప్రభుత్వ రేషన్ బియ్యం పక్కదారి పట్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుంపలపల్లిలో కంటి వెలుగు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని దుంపలపల్లి వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని నాలుగో వార్డ్ కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్‌తో కలిసి చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్ కోల వెంకట్ స్వామి గౌడ్,ఎంపిటిసి రామవరం మాధవి రెడ్డి,పద్మయ్య,కంటి వెలుగు క్యాంపు సిబ్బంది,అంగన్వాడి టీచర్లు,ఆశాలు,పలువురు పాల్గొన్నారు.

రామకోటి సేవలు అభినందనీయం



నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1000కోట్ల లిఖిత మహా యజ్ఞంల ఉందని భద్రాచల దేవస్థాన ఏఈవో శ్రవణ్ కుమార్ అన్నారు. సోమవారం రామకోటి సేవలను ఆయన అభినందించారు. రామకోటి రామరాజుకు భద్రాచల దేవస్థానం నుండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం రామకోటి లిఖిత పుస్తకాన్ని అందించారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి కల్యాణం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ 11 వార్షికోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి అభిషేకం నిర్వహించి, ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. వైదికులు డింగరి రంగాచార్యులు, సేనాపతి రామాచార్యులు. నరసింహచార్యులు,ఆలయ పూజారి డింగరి విష్ణుతేజాచార్యుల ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్న దానం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా రంగాచార్యులు మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరున్ని కొలిచిన వారికి సకల శుభాలు కలుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు దౌల్తాబాద్‌లో ఎంపీ పర్యటన

నవ తెలంగాణ-దౌల్తాబాద్

మండలంలోని శౌరిపూర్ ,కోనాపూర్ , షేర్ పల్లి బందారం గ్రామపంచాయతీ పరిధిలోని మధిర గ్రామమైన నర్సంపేటలో బీసీ కమ్యూనిటీ భవనాన్ని మంగళవారం ఎంపీ ప్రభాకర్ రెడ్డి ప్రారంభిస్తారని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

రామాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో ఉన్న సీతారామ ఉమామహేశ్వర దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం సీతారామ ఉమామహేశ్వర రథోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి హరీష్ రావు కృషితో రామాలయం ఎండోమెంట్లో చేర్చడం జరిగిందని గుర్తు చేశారు. ఐదు కోట్లు నిధులు కేటాయించి రామాలయమును పునర్నిర్మానం చేశామన్నారు. రానున్న కాలంలో సీతారామ ఉమామహేశ్వర దేవాలయాన్ని ఎండోమెంట్ కింద మరింత అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, టి ఎస్ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి , మున్సిపల్ చైర్మన్, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ జకియొద్దిన్, మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీధర్ రావు, నేతి శ్రీనివాస్, నర్సింగరావు, బాల్ కుమార్, తుం శ్రీధర్, రమేష్ గౌడ్, మొనగారి రాజు, హనుమంత రెడ్డి, మహేందర్, నాయకులు, సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, నరేష్, కొట్టాల యాదగిరి గుంటుకు రాజు, బోస్, శ్రీధర్,



నర్సింగరావు, మల్లేశం, స్వామి చారి, వంతులు రాజు, వాసు, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటుకు నిర్మాణాలు చేపట్టకూడదని స్టే

నవ తెలంగాణ -గజ్వేల్

ఐఓసీ సర్కిల్ వద్ద భగత్ సింగ్ విగ్రహ ఏర్పాటు స్థలంలో ఎలాంటి ఇతర నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు స్టే విధించింది. హైకోర్టు ఆర్డర్ కాపీని భగత్ సింగ్ విగ్రహ నిర్మాణ కమిటీ, వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు నేతలు కమిషనర్‌కు అందజేశారు. సోమవారం భగత్ సింగ్ నిర్మాణ కమిటీ మాట్లాడుతూ భగత్ సింగ్ విగ్రహ నిర్మాణానికి మున్సిపల్ పర్మిషన్ ఉన్నప్పటికీ విగ్రహ నిర్మాణాన్ని కావాలనే దురుద్దేశంతో, కక్షపూరితంగా అడ్డుకుంటున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు అక్కడ మున్సిపల్ పాలకులు ఎలాంటి నిర్మాణాలు చేపట్టా కూడదని "స్టేటస్ కో" ఆర్డర్ ఇవ్వడం జరిగిందని భగత్సింగ్ నిర్మాణ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో బి యస్ పి నాయకుల ఓం ప్రకాష్,కర్ణాకర్, నరేశ్ , మహేందర్, ప్రసాద్,బి జె పి నేతలు ఎల్కంటి సురేష్, మనోహర్, ఆర్ కే యాదవ్,వెంకటేష్, కర్ణాకర్ ,యమ్ ఆర్ పి యస్ నాయకులు ముంద్రాతి కృష్ణ, ఆంజనేయులు, రమేష్ మాలమహానాడు నాయకులు కృపానందం, నరేశ్,



మురళి, స్వామి యువజన సంఘాల నాయకులు, విజయ్, గోపాల్, స్వామి, సుధీర్, గిరి భగత్ సింగ్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు కానుగుల రమనకర్ మరియు కెతోజి వినోద్ మరియు విద్యార్థి సంఘం నాయకులు రాజు,గౌతమ్,కృష్ణ, మహేష్, నవీన్, నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వీఎం వైద్య శిబిరానికి మంచి స్పందన

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం నర్మెట గ్రామంలో ఆర్వీఎం సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని సర్పంచ్ అజీజ్ పాషా అన్నారు. సోమవారం నంగునూరు మండలం నర్మెటలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరంలో 324 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 56 మంది వివిధ వ్యాధులతో బాధపడుతున్నట్లు తెలిసింది. వారందరినీ త్వరలోనే ఆర్వీఎం హాస్పిటల్‌కు సంబంధించి వాహనంలో తరలించి ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. గ్రామస్తులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య సేవలు అందించిన డాక్టర్లను ఆయన అభినందించారు.



మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి, ఆర్వీఎం ఆసుపత్రి వైద్య బృందం డాక్టర్ ప్రభాస్,డాక్టర్ అబ్బుబాకర్ ,డాక్టర్ కీర్తి, మార్కెటింగ్ సిబ్బంది లక్ష్మణ్, కళ్యాణ్, ప్రకాష్ పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకే గంగాధర్ రావు

నవ తెలంగాణ మెదక్ టౌన్

తెలంగాణ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిన్నశంకరంపేట మండలం కొర్వి పల్లి గ్రామానికి చెందిన ఏకే గంగాధర్ రావును నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రకటించారు. ఈ సందర్భంగా గంగాధర్ రావు మాట్లాడుతూ దివంగత సీఎం ఎన్టీఆర్ 1982లో టీడీపీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీ మారకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని తెలిపారు. పదవుల కోసం, కాంట్రాక్టుల కోసం పార్టీలు మారే నేటి సంస్కృతిలో పార్టీలు మారకుండా నిజాయితీగా పార్టీ నియమ నిబంధనలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్నానన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్న ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని చంద్ర బాబు నాయుడుకి విధేయుడిగా ఉంటూ నేటికి పార్టీనే నమ్ముకొని పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడుతానన్నారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తన నియామకానికి కృషిచేసిన చంద్రబాబు నాయుడు, పార్టీ తెలంగాణ



అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రవల్లిని వరించిన జాతీయ పంచాయతీ అవార్డు

నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కుక్ మండల పరిధిలోని సిఎం కెసిఆర్ దత్తత గ్రామమైన ఎర్రవల్లికి జాతీయ పంచాయతీ అవార్డు దక్కింది. 2021-22 సంవత్సరానికిగాను ఎర్రవల్లి గ్రామపంచాయతీలో ప్రతి ఇంట్లో సోలార్‌ను వినియోగిస్తున్నందుకు గ్రామ్ ఉర్జా స్వరాజ్ విశేష్ పంచాయతీ పురస్కారం జాతీయ అవార్డు వరించింది. సోమవారం దేశ రాజధాని ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ పంచాయతీ అవార్డు గ్రహీతల ఫిలికేషన్ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, జాతీయ గ్రామీణ రూరల్ డెవలప్మెంట్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ల చేతుల మీదుగా ఎర్రవల్లి సర్పంచ్ మొండి భాగ్యబిక్షపతికి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, పంచాయత్ రాజ్ కమీషనర్ ఎం.హనుమంతరావు,



సిద్దిపేట జిల్లా అడిషినల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్,డీపివో సురేష్ బాబు, డిప్యూటీ కమీషనర్లు పంచాయతీ రాజ్, జాయింట్ కమిషనర్లు, సిద్దిపేట అడిషినల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్, డీపీవోలు సురేష్ బాబు, ఎర్రవల్లి పంచాయతీ కార్యదర్శి విద్యావికాస్ రెడ్డి, తదితరులున్నారు.

దుబ్బాకలో రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహావిష్కరణ

నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలో మండల రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొత్వాల్ రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహాన్ని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్లో మండల రెడ్డి జేఏసీ అధ్యక్షుడు గడీల జనార్ధన్ రెడ్డి,అమ్మన రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ ప్రభాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు.సీఎం కేసీఆర్ ను కలిసి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు.రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు రెడ్డి సోదరులంతా ఐకమత్యంతో ఉండాలని కోరారు.ఆ తర్వాత పలువురు రెడ్డి నాయకులను మెదక్ ఎంపీ శాలువాలు కప్పి సన్మానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి,ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి,రెడ్డి నాయకులు కోమటిరెడ్డి వెంకట నరసింహారెడ్డి,కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి,మామిడి మోహన్ రెడ్డి,కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి,గుండెల్లి లక్ష్మారెడ్డి,



పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు,మండల సర్పంచ్లు, ఎంపీటీసీలు, జిల్లా రెడ్డి నాయకులు పాల్గొన్నారు.